Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 333 | కరీంనగర్ | గురువారం 23 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## ఘోష్ కమిషన్‌ను పక్కన పెట్టిన హైకోర్టు

### న్యాయం గెలిచినట్లేనన్న పద్మాదేవేందర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్,ఏప్రిల్22 : కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్టేనని ఆమె పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

### ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదారబాద్,ఏప్రిల్22 :ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు

11లో



## ఆర్టీసి సమ్మెతో

# బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు - డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన - నగరంలో అద్దె బస్సులను ఫ్రగీ తిప్పిన ప్రభుత్వం - చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ - కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు - నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్ - కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచి పోయా యి. డిపోల వద్ద పోలీసు లు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే

11లో

## కాళేశ్వరం ప్రాజెక్టుపై

# కెసిఆర్, హరీష్‌లకు ఊరట

### - జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 22 :కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు

11లో

## కాళేశ్వరంపై ఎవ్వరికీ

# క్లీన్ చిట్ ఇవ్వలేదు

- హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
- తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
- సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో

11లో

## ఎన్ని కుట్రలు పన్నినా

# న్యాయం గెలిచింది

### - హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్22 :ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది.

11లో

## హైకోర్టు తీర్పుతో

# బుద్ధి తెచ్చుకోవాలి

### - కాంగ్రెస్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హితవు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదారబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు తీర్పును చూసైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జీవధార కాళేశ్వరం మీద నిందలు మోపి బీఆర్ఎస్ , కేసీఆర్ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు కాంగ్రెస్, బీజేపీ వాడుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్ట్‌ను రెండున్నరేళ్లు మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారు. చివరకు

11లో

# కాళేశ్వరం అవినీతి జగమెరిగిన సత్యం

- అన్ని నివేదికలు ఇదే చెప్పాయి
- హైకోర్టు తీర్పుపై కోదండరామ్ వ్యాఖ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబం ధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీజేఏసీ అధ్యక్షులు కోదండరాం స్పందించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేద న్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి జరిగిందని, లోపాలు ఉన్నాయని కాగ్, విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్‌లు ఇచ్చాయని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. విచారణ చేయకపోతే సీబీఐదే తప్పవుతుందని టీజేఏసీ అధ్య క్షులు చెప్పు కొచ్చారు. కాళేశ్వరం లో

11లో

# డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

- ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు
- సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జెఎసి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నహాలు ప్రారంభించింది.

11లో

# కాళేశ్వరం కథ ముగియలేదు

- సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు
- బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో
- మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమీషన్ల కక్కుర్తి వల్లే

11లో

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్

# ప్రభుత్వానికి చెంపపెట్టు



- కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం
- అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు
- ప్రభుత్వ వైఫల్యాన్న బయటపెట్టిన హైకోర్టు తీర్పు
- విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం

11లో

# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

- వెంటనే సమ్మె విరమించి రండి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదారబాద్,ఏప్రిల్22 :ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో



29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని

11లో





# నాణ్యతే లక్ష్యం.. ప్రగతే పథం - మంత్రి పొంగులేటి

## - రూ.6.50 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన - వర్షాకాలం లోపే పూర్తి చేయాలని ఆదేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 22 : ప్రభుత్వ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి, రహదారులను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో చింతపల్లి నుంచి ముత్తగూడెం వరకు రూ. 6.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతను కాపాడాలని సూచించారు. ముత్తగూడెం అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 16.70 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడిస్తూ, మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాల ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని, త్వరలోనే రెండో విడత పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హైకోర్టు తీర్పు పాలకులకు చెంపపెట్టు : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్వాగతిస్తూ, అది పాలకులకు చెంపపెట్టువంటిదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం సాగునీటి పథకంపై పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పును బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్వాగతించారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు స్పష్టం చేయడం కీలక పరిణామమన్నారు. విచారణ సందర్భంగా ప్రాథమిక న్యాయ సూత్రాలు, విధానాలు పాటించలేదని కోర్టు పేర్కొనడంతో ఆ నివేదికకు చట్టబద్ధత లేదని తేటతెల్లమైందని వివరించారు. సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సమంజసం కాదని హైకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై రాజకీయ ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను ఉపయోగించుకుందని ఆరోపించారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుపై నిరాధార ప్రచారం చేస్తూ కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు సకాలంలో చేపట్టకుండా ఆలస్యం చేసి ఇప్పుడు ప్రారంభించడం బాధాకరమన్నారు. హైకోర్టు తాజా తీర్పుతో కేసీఆర్, హరీష్ రావులపై చేసిన ఆరోపణలు నిరాధారమని స్పష్టమైందని పేర్కొంటూ, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ వైఖరిలో మార్పు తీసుకురావాలని సూచించారు. చివరగా, న్యాయం, ధర్మమే గెలుస్తాయనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి నిరూపించిందని, ఇది పాలకులకు చెంపపెట్టువంటిదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు.

# ప్రతి ఇంటికి నిరంతర నీటి సరఫరా

## - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ - నగర శుభ్రతలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి - మేయర్ మహంకాళి స్వామి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : త్వరలో నగరమంతా 24 గంటల మంచి నీటి సరఫరా ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నట్లు రామగుండం శాసన సభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ వెల్లడించారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మేయర్ మహంకాళి స్వామితో కలిసి 59వ డివిజన్ అశోక్ నగర్, గాంధీ నగర్, మార్కండేయ కాలనీ ప్రాంతాలలో బుధవారం పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా రామగుండంలో రోజు విడిచి రోజు మాత్రమే నీటి సరఫరా జరుగుతుండగా తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రోజూ ఇస్తున్నామని అన్నారు. నిండు వేసవిలోనూ నీటి కొరత రాకుండా సరఫరా జరుగుతున్నదని అన్నారు. ప్రతి ఇంటికి నిరంతరాయంగా నీటి సరఫరా చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. నీటి పైప్ లైన్ లలో లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయాలని సంబందిత సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీల వద్ద మంచి నీటి సరఫరా పైప్ లైన్లలో లీకేజీలు ఏర్పడినప్పుడు మరింత అప్రమత్తంగా ఉండి వెంటనే అరికట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలోనూ కలుషిత నీరు పైప్ లైన్లలోకి చేరకుండా నివారించాలన్నారు. తన పర్యటనలో భాగంగా మార్కండేయ కాలనీలోని ఒక విద్యా సంస్థ వద్ద చుట్టు ప్రక్కల వారు చెత్త వేయయడాన్ని గమనించి అలాంటి చోట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సదరు విద్యా సంస్థ నిర్వాహకులకు అవగాహన కల్పించి పరిసరాలన్నీ దత్తత తీసుకొని వారే రోజూ సానిటేషన్ చేసేలా ప్రేరేపించాలని అన్నారు. నగరం శుభ్రంగా, సుందరంగా ఉండాలంటే ప్రజలు, వివిధ వ్యాపార సంస్థల భాగస్వామ్యం తప్పనిసరని అన్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలువల్లో పూడిక తీయించడానికి మేయర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఏండ్ల తరబడి పూడిక తొలగించకపోవడంతో చుట్టు ప్రక్కల దోమలు, ఈగలు, పందులు పెరుగుతూ అనారోగ్యకర పరిస్థితులు నెలకొని వ్యాధులు విజృంభిస్తున్న విషయం గమనించాలని అన్నారు. కాలువల్లో పూడికతీత ఒక మహా యజ్ఞంలా చేపడుతున్నామని అన్నారు.

ఇకముందు కాలువలో చెత్త వేసే వారి ఫోటోలు తీసి నగర పాలక సంస్థ సిబ్బందికి ఇస్తే సదరు వ్యక్తులకు జరిమానా విధిస్తామని అన్నారు. మెప్మా ఆర్పిలు, వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్లు ఈ మేరకు ఇంటింటా అవగాహన కల్పించాలని అన్నారు. కాగా ఈ సందర్భంగా రోడ్డు మీదకు వచ్చేలా ఇంటి ముందు కట్టిన మెట్లు, గద్దెలు తొలగించారు. పాత విధ్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డు లేకుండా మరో చోట కొత్త స్తంభాలు వేయాలని ట్రాన్స్ కో అధికారులకు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త పైప్ లైన్లు వేసి ఇంటింటా నల్లా కనెక్షన్ వెంటనే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పోరేటర్ బాలసాని తిరుపతితోపాటు కార్పొరేటర్లు వడ్లూరి రవి, దాసరి సాంబమూర్తి, ధూళికట్ట సతీష్, తాళ్ళపెల్లి యుగంధర్, చిదురాల నాగరాజు, నాయకులు కజాంపురం రాజేందర్, మారెల్లి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ఇ గురువీర, ఈఈ రామన్, టిపిఎస్ నవీన్, ఎఇ మీర్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అక్రమాలు - చేయని పనులు చేసినట్లు నిధులు దోచుకుంటున్న ప్రైవేటు ఉద్యోగులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



View daily attendance taken at the work site (Through NMMS App)

State: TELANGANA District: Kumram Bheem(Asifabad) Block: KERAMERI Panchayat: KESALA GUDA

Group Photo 1

Uploaded Group Photo-1

Timestamp for Photo-1

Second Photo is not uploaded!

View daily attendance taken at the work site (Through NMMS App)

State: TELANGANA District: Kumram Bheem(Asifabad) Block: KERAMERI Panchayat: KESALA GUDA

Group Photo 1

Uploaded Group Photo-1

Timestamp for Photo-1

Second Photo is not uploaded!

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22 : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉపాధి హామీ పథకంలో కొన్నిచోట్ల అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. చేయని పనులు చేసినట్లు అంతా కనికట్టు అన్నట్టు కొందరు అధికారుల పర్యవేక్షణ తీరుతో అర్థం అవుతుంది. మారుమూల ప్రాంతాలలో చేయని పనులు చేసినట్లు, మరికొన్నిచోట్ల బినామీల పేర్లను నమోదు చేసి వారి పేర్ల పైన జమ అయ్యే డబ్బులను కొల్ల గొడుతుండడం విస్మయానికి గురిచేస్తుంది. వలసలను నివారించేందుకు వారికి పనులు కల్పించి ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో కొన్నింటిని ఆసరాగా చేసుకొని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కొందరు అధికారులు, ఇతర దళారులు చేతులు కలిపి చెరిసగం పంచుకుందాం అన్నట్లుగా ఇక్కడి పరిస్థితులు అద్దం పడుతున్నాయి. మారుమూల ప్రాంతాలలో జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడంతో తాము ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా ఉంది. కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం కేస్లాగూడ గ్రామపంచాయతీలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. పనిచేయకుండా కూడా పనిచేసినట్లు నమోదు చేస్తున్నారు . కేరమేరీ మండలానికి చెందిన ఓ వ్యక్తి దళారీగా అవతారం ఎత్తి అక్రమాలను చకచగా చేసేసుకుంటున్నాడు. సదరు వ్యక్తి ఆయన కుటుంబ సభ్యుల పేర్లు, అలాగే అతనికి సన్నిహితంగా ఉన్న వారి పేర్లను ఉపాధి హామీలో పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బందితో నీతులు కలిపి మస్టర్లు వేపిస్తున్నాడు. ఆఖరికి వృద్ధుల పేర్లు నడవలేని వారి పేర్లు, అతనికి సన్నిహితంగా ఉన్న వారి కొందరి పేర్లు రాసుకొని వారు పనిచేస్తున్నట్లుగా మస్టర్‌లో నమోదు చేస్తూన్నారు. అందులో ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న వారి పేర్లు కూడా ఉపాధి హామీలో పనిచేస్తున్నట్లుగా పేర్లు వ్రాయించి అలాగే ఫోటో క్యాప్చరింగ్ కూడా ఇంటి వద్ద నుంచే ఫోటో తీసి అవే ఫోటోలను ప్రతి రోజు పనిచేస్తున్నట్లుగా ఆన్లైన్లో ఒకటే ఫోటోను వారం రోజులుగా అప్లోడ్ చేస్తున్నారు. ఈనెల 11 నుంచి నేటి వరకు కూడా కేస్లాగుడ గ్రామ పంచాయితీలో 1053, 1054,1055,1056,1058, మాస్టర్ లలో ఒకటే ఫోటోను ప్రతీరోజు హాజరు అవుతున్నట్లుగ నమోదు చెస్తున్నారు. ఇలా తప్పుడు మస్టర్లు వేయడం, బినామీల పేర్ల మీద డబ్బులు స్వాహా చేయడం ఉపాధి హామీ అధికారులకు, కొంతమంది సిబ్బందికి ఇది శర మామూలే అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై కేరమేరి ఉపాధి హామీ ఎపిఓ మల్లయ్యను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని కేసులగూడా పనులు జరిగే చోటుకి వెళ్లి పరిశీలిస్తానని తెలిపారు. చేయని పనులకు చేసినట్లు రికార్డులు సృష్టిస్తున్నారు కోవావిజయ్: తుడుం దెబ్బ జిల్లా నాయకుడు: కిరమరి మండలంలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. చేయని పనులకు చేసినట్లు రికార్డులు సృష్టిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్కు ఫిర్యాదు చేశాను. బినామీలను పెట్టి హాజరు వేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అర్హులైన వారికి పని కల్పించి నిధులు వృధా కాకుండా చూడాలి.

# సమ్మె సమయంలో హింసకు పాల్పడితే చర్యలు తప్పవు

## - ప్రజా రక్షణ, శాంతి భద్రతకే ప్రాధాన్యం
## - ఉద్యోగం కోసం వచ్చే డ్రైవర్లు, కండక్టర్లకు పూర్తి భద్రత
## - పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె సమయంలో విధుల్లో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లు, అలాగే బస్సుల యజమానులను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, ఇళ్లపై దౌర్జన్యాలకు దిగడం వంటి ఘటనలను పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. అటువంటి చర్యలు చట్ట విరుద్ధమని, పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎవరూ భయపడకుండా తమ విధులు నిర్వర్తించాలనీ, ఉద్యోగం కోసం వచ్చే వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని పోలీసులు భరోసా ఇచ్చారు. ఎవరైనా బెదిరింపులు, దాడులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉన్నారని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని కమీషనర్ తెలిపారు. అత్యవసర సహాయం కోసం రామగుండం పోలీస్ కమీషనరేట్ కంట్రోల్ రూమ్: 87126 56597, డయల్ 100 కాల్ చేయాలని తెలిపారు.

# పేదల డాక్టరు సురేందర్... అకాల మరణం...!

## ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిన వైద్యుని మరణం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 22 : అనారోగ్యంతో ఆసుపత్రికి ఎప్పుడు వెళ్ళినా... నేను ఉన్న.. ఆరోగ్యం గురించి భయపడవద్దు... పైసలు లేవని చింతపడవద్దు... ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేస్తా. మీ ఆరోగ్యం బాగుంటే అంతే చాలు. అంటూ ప్రజల గుండెల్లో ఆప్యాయతగా నిలిచిన ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సురేందర్ బుధవారం గుండెపోటుతో మృతి చెందిన ఘటన ముధోల్ నియోజకవర్గంలో విషాదం నింపింది. నర్సాపూర్.జి సామాజిక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సమయపాలన పాటిస్తూ ఆరోగ్య సిబ్బందికి సమన్వయంగా ఉంటూ పేద ప్రజలకు ఏ రోగం వచ్చిన నేనున్నానంటూ భరోసా కల్పించి ప్రభుత్వ వైద్యునిగా బైంసా నర్సాపూర్.జి ఆసుపత్రిలో ఎందరో మంది పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించిన ఘనత డాక్టర్ సురేందర్‌ది. ప్రైవేటుకు వచ్చిన ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్సలను ప్రోత్సహించిన వైద్యుడు గుండెపోటుతో మరణించారని తెలవడంతో ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి గురై దేవుడు ఆయనకు అన్యాయం చేసిందని చర్చించుకున్నారు. ఇప్పుడు హెల్తీగా ఆరోగ్యంగా ఉండే వైద్యులు ఇక లేరు అన్న భావన ప్రజలలో తీవ్ర విషాదాన్ని నింపింది. డాక్టర్ సురేందర్ మృతి పట్ల నర్సాపూర్ వైద్యులతో పాటు నిర్మల్ జిల్లా వైద్యుల సైతం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పేదల వైద్యుని కూల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# సమస్యలు పరిష్కరించకుంటే 'సింగరేణి'లో సమ్మెకు సిద్ధం

## - ఏఐటీయూసీ నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 : సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెం శేషగిరి భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. చాలా కాలంగా పరిష్కారం కాని కార్మిక సమస్యలను నిర్లక్ష్యం చేయడం యాజమాన్యం వైఫల్యమని విమర్శించారు. కారుణ్య నియామకాలపై కొనసాగుతున్న ఏసీబీ విచారణను నిలిపివేయాలని, సంస్థలో కార్మికుల ఆరోగ్య సమస్యల దృష్ట్యా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ. 50 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, వాటి చెల్లింపులో ఆలస్యం చేయడం వల్ల సంస్థను ఉద్దేశపూర్వకంగా నష్టాల్లోకి నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత దశాబ్దంగా కొత్త గనుల ప్రారంభంలో నిర్లక్ష్యం, కార్మిక సంక్షేమంపై నిరాసక్తత కారణంగా సంస్థ భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. అదేవిధంగా స్ట్రక్చర్ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, వై.వి.రావు, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, వైస్ ప్రెసిడెంట్ క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం అభివృద్ధికి ఖచ్చితమైన జనగణన కీలకం

## మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : రామగుండంలో స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి వివరాలు జనగణన లో నమోదు చేయాలని ఎన్యూమరేటర్లను నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ఎన్టిపిసి పిటిఎస్ కాకతీయ కళ్యాణ మండపంలో జనగణన లో భాగంగా నిర్వహిస్తున్న రెండవ బ్యాచ్ ఎన్యూమరేటర్ల శిక్షణా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు స్వంత ఊళ్ళో ఉన్నా, మరో చోట ఉన్నా, రామగుండశీలో నివాసం ఉంటున్నట్టయితే ఇక్కడ జన గణనలోనే వివరాలు నమోదు చేయాలని అన్నారు. గతంలో జరిగిన సర్వేలలో కొందరు అపోహలతో ఇక్కడ వివరాలు నమోదు చేసుకోకపోవడంతో జనసంఖ్య తగ్గినట్టుగా కనిపిస్తున్నదని అన్నారు. రామగుండంలో దిన దినాభివృద్ధి జరుగుతున్న క్రమంలో జన సంఖ్య పెరిగిందని అన్నారు. స్వంత ఇల్లు లేకపోయినా ఏడాదిలో ఎక్కువకాలం ఇక్కడే గడుపుతున్నారు కాబట్టి ఇక్కడే వివరాలు నమోదు చేయాలని అన్నారు. తద్వారా రామగుండంలో జనాభాకు తగినట్లుగా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలని కవిత, వడ్లూరి రవి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, అసిస్టెంట్ కమీషనర్ వెంకటేశ్వర్లు, ఎసిపి శ్రీహరి, టిపిఎస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి

## -మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : టీజీ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని బుధవారం సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చారని, కేసీఆర్ ఎన్నికల సందర్భంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ కూడా అధికారంలోకి వస్తే ప్రభుత్వంలో విలీనం చేస్తామని మానిఫెస్టోలో పెట్టడం మూలంగా ఆర్టీసీ కార్మికులు నమ్మి గెలిపించారని, కానీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలయినా విలీనం ప్రక్రియ మొదలు కాలేదని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగుల స్థానంలో మరొకరికి అవకాశం కల్పించకుండా ఆర్టీసీ యాజమాన్యం ఎలెక్ట్రికల్ బస్సులను తీసుకువచ్చి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని విమర్శించారు. ఇప్పుడు కూడా ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేయాలని అద్దె బస్సులను నడుపుతూ, ప్రయాణికులను ప్రమాదాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇలాంటి కవ్వింపు చర్యలను ఆపి, ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సమ్మయ్య, నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, మూల విజయా రెడ్డి, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, కిరణ్ జీ, సట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ అరుణశ్రీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22: నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఆదేశించారు. బుధవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై కాంట్రాక్టర్లు , ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తయిన పనులను సకాలంలో రికార్డు చేసి బిల్లుల చెల్లింపులో కూడా జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. . పెండింగ్ లో ఉన్న పలు పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ లకు ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలకసంస్థ ఎస్ఇ గురువీర, ఇఇ రామన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి మన ప్రభుత్వం : మంత్రి పొంగులేటి

**- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్-ఆరు నెలల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ.**

**- నేలకొండపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 22 : రాష్ట్రంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేలకొండపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తూ రైతులకు అనుకూల నిర్ణయాలను వివరించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. సన్న వడ్ల సాగును ప్రోత్సహిస్తూ మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని వెల్లడించారు. రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఆలస్యం లేకుండా వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని పేర్కొంటూ, గతంలో ఐదేళ్లలో చేయలేని రుణమాఫీని కేవలం ఆరు నెలల్లోనే రూ.21 వేల కోట్లు విడుదల చేసి 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గతంలో రైతుబంధు కింద రూ.10 వేల చొప్పున అందిస్తే, ప్రస్తుతం రైతు భరోసా ద్వారా రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని చెప్పారు.



రైతులు పండించిన పంటను భద్రపరచుకునేందుకు రాష్ట్రంలో గోదాముల సామర్థ్యాన్ని 200 శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రైవేట్ రంగానికి దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం చేపట్టి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలను ఆర్థిక ఒత్తిడుల మధ్య కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనానికి భద్రాద్రి జిల్లా ఎస్‌పి. రోహిత్ రాజ్‌కు ఆహ్వానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 : ఈ నెల 26న భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించి సమ్మేళనం కమిటీ సభ్యులు జిల్లా ఎస్పి రోహిత్ రాజ్‌ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సమ్మేళనం యొక్క ఉద్దేశాలు, కార్యక్రమ వివరాలు మరియు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్.పి. రోహిత్ రాజుకి వివరించారు. కార్యక్రమం శాంతియుతంగా, క్రమబద్ధంగా నిర్వహించబడుతుందని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ కార్యక్రమంపై వివరాలు తెలుసుకుని, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, హిందూ సమ్మేళనం కార్యక్రమం సమాజ ఐక్యత, ధర్మ పరిరక్షణ, సాంస్కృతిక విలువల బలోపేతం లక్ష్యంగా నిర్వహించబడుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పి. వీరవర్ధనరావు, కార్యదర్శి లట్టి జగన్ మోహన్, సభ్యులు గుర్రం వెంకట్ రెడ్డి, పిల్లి రాజేశ్వరరావు, యెలదండి పూర్ణచందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులు వేగవంతం చేయాలి

**- వర్షాకాలానికే గోదావరి జలాలు అందించేలా చర్యలు-అధికారులకు కఠిన ఆదేశాలు**

**- సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 : సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి వర్షాకాలానికే గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని యతలకుంటలో బుధవారం నిర్వహించిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ సమీక్షా సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సమావేశానికి అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరయ్యారు. సమీక్షకు ముందు మంత్రి అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యతలకుంట వరకు సాగుతున్న కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్లు, కాలువ పనుల పురోగతిపై అధికారులకు సూచనలు చేసి పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని వీడి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సుమారు 43 కిలోమీటర్ల పొడవున్న ఈ ట్రంక్ కాలువ ద్వారా 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో రూ.700 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.600 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని చెప్పారు. యతలకుంట టర్మినల్ పనుల్లో చివరి 30 మీటర్లు మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మే నెలాఖరులోగా అన్ని పెండింగ్ స్ట్రక్చర్ పనులు పూర్తి చేసి, వర్షాకాలానికి ముందే కీలక నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు విడుదల చేసినట్లు పేర్కొంటూ, భూ సమస్యలు, కోర్టు కేసుల కారణంగా పనులు ఆలస్యమైతే వెంటనే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. చిన్న చిన్న సమస్యలతో



పనులు నిలిపివేయడం సహించబోదని హెచ్చరించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పలు మండలాలకు మళ్లించే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే రాజీవ్ కాలువ ద్వారా 1.35 లక్షల ఎకరాలకు నీరు అందించినట్లు వెల్లడించారు. నాలుగో పంప్ హౌస్ పూర్తి అయితే అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు నీరు అందించవచ్చని, మొత్తం కాలువ వ్యవస్థ 110 కిలోమీటర్ల మేర పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ జిల్లాల్లోని 8 నియోజకవర్గాలు లాభపడతాయని చెప్పారు. పాలేరు ప్రాంతానికి గోదావరి జలాలు చేరాలంటే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పినపాక నియోజకవర్గంలో 16,500 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్ట్‌ను నిర్ణీత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్, పోలీస్, అటవీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందే సంక్షేమ వసతి గృహాల పాఠశాలలో మరమ్మత్తులు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 22 : వర్షాకాలానికి ముందే అన్ని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలో మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మొగుళ్లపల్లి మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరమ్మతులు చేయాల్సిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ, మహాత్మ జ్యోతిబాపూలే, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో మరమత్తులకు సంబంధించి ప్రతిపాదనలు అందజేయాలని ఆయన సంబందిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశిం చారు. 31 పాఠశాలల్లో చేపట్టిన మరుగుదొడ్ల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని పాఠశాలలో నూరు శాతం మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా ఉండాలని స్పష్టంచేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా పునరుద్ధరణ పనులను మే 10 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ వారంలో జరుగుతున్న సంక్షేమ వారోత్సవాలలో అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యంతో దిగ్విజయం చేయాలని ఆయన సూచించారు. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన పనులకు అగ్రిమెంట్ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. టెండర్ పూర్తి అయిన పనులను తక్షణమే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, బిసి సంక్షేమ అధికారి ఇందిర, పీఆర్, గిరిజన, టీడబ్లుఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్ సునీత, ఎంపిడివో సురేందర్, సర్పంచ్ విజయ, ప్రిన్సిపల్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన డీఎల్ఎడ్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**భద్రాచలం ఐటిడీఏ పీఓ రాహుల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 : 2026-28 విద్యా సంవత్సరానికి భద్రాచలం గిరిజన డీఎల్ఎడ్ కళాశాలలో ప్రవేశాల కోసం ఏజెన్సీ ప్రాంత గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. రాష్ట్రంలోని ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థుల సంక్షేమార్థం భద్రాచలం ఐటిడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన డీఎల్ఎడ్ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కళాశాలలో 2026-28 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో తెలుగు మీడియంలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థులే దరఖాస్తు చేసుకోవాలని, మే/జూన్ 2026 నాటికి లేదా అంతకు ముందు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి కనీసం 45 శాతం మార్కులు పొందిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా ఇంటర్మీడియట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా జరుగుతుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలు, ప్రత్యేక కేటగిరీలకు రిజర్వేషన్లు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. దరఖాస్తు ఫారాలు, ప్రాస్పెక్టస్ ఉచితంగా లభిస్తాయని, ఏటూరు నాగారం, ఉట్నూర్, మన్ననూరు ఐటిడీఏ కార్యాలయాలు, అలాగే భద్రాచలం గిరిజన డీఎల్ఎడ్ కళాశాలలో పొందవచ్చని తెలిపారు. పోస్టు ద్వారా పొందాలనుకునే వారు స్వంత చిరునామా ఉన్న కవర్‌ను (రూ.10 స్టాంపుతో) ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలంకు పంపవచ్చన్నారు. దరఖాస్తులను పూర్తి వివరాలతో నింపి వచ్చే నెల 11వ తేదీలోపు సమర్పించాలని, అసంపూర్ణ దరఖాస్తులు తిరస్కరించబడతాయని హెచ్చరించారు. మరిన్ని వివరాలకు 9959575539, 8639084543, 8309972776 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఐటిడీఏ పీఓ రాహుల్ కోరారు.



# ఆర్టీసీ సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 22 : ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని చేస్తున్న సమ్మెకు ఏఐటీయూసీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది ఈ సందర్భంగా ఏఐటీయూసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోటపలు కుల రమేష్, క్యాతరాజు సతీష్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన డిమాండ్లను నెరవేర్చాలని వారు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వము స్పందించి వెంటనే వాళ్లను చర్చలకు పిలిచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వారి డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనియెడల ఆర్టీసీ కార్మికులకుఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేసి వారితోపాటు వారి సమ్మె విజయవంతము అయ్యే వరకు ప్రతి కార్యక్రమాల్లో ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం వారి వెంట ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుధాకర్ రెడ్డి, వేముల శ్రీకాంత్ ,నేరెళ్ల జోసెఫ్, బాబురావు, పొన్నగంటి లావణ్యతో పాటు ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# మగాళ్లకూ బస్ ఫ్రీ

**- టికెట్ లేని ప్రయాణం నేరం.. ఇది టీజీ ఆర్టీసీ నినాదం**

**- ఈ రోజు టికెట్ లేకుండానే ప్రయాణించేరు రండని ప్రజలకు ఆహ్వానం**

**- ఆర్టీసీ జేఏసీ సమ్మె విచ్ఛిన్నం కోసం నిబంధనలకు తిలోదకాలిచ్చిన ప్రభుత్వం**

**- ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్**

**- ఖనిలో డిపోలకే పరిమితమైన బస్సులు**

**- భారీ పోలీసు బందోబస్తు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : టీజీ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీతో ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుండి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల రవాణా కష్టాలు మొదలయ్యాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉచిత బస్సు పథకం కింద నెలకు రూ.400 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, బ్రెడ్ విన్నర్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పోస్టులను తక్షణమే పర్మినెంట్ చేయాలని, అద్దె బస్సు డ్రైవర్లను సంస్థలో విలీనం చేయాలని, సంస్థ ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థకు అప్పగించాలనే తదితర 32 డిమాండ్లతో ఆర్టీసీ కార్మికులు సమ్మెలోకి దిగారు. మంగళవారం ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మె బాట పట్టారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసారు. ఈ నేపథ్యంలో గోదావరిఖనికి చెందిన బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. ఖని డిపో నుండి 86 సంస్థ బస్సులు, 40 అద్దె బస్సులు



పలు ప్రాంతాలకు ప్రయాణీకులను చేరవేయడానికి సేవలందిస్తూ ఉండగా, సంస్థ బస్సులు డిపోకే పరిమితం కావడంతో ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసామని, అద్దె బస్సులను నడిపిస్తున్నామని డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. కండక్టర్లు లేకపోవడంతో అధికారుల ఆదేశాల మేరకు స్త్రీలను, పురుషులను ఉచితంగానే వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నామని పలువురు డ్రైవర్లు పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ వచ్చేవరకు సమ్మెను నిరవధికంగా కొనసాగిస్తామని జేఏసీ నాయకులు వంగర శ్రీనివాస్, కండక్టర్ అంజలి తదితరులు తెలిపారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో, వన్ టౌన్ సిఐ ఇంద్రసేనా రెడ్డి నేతృత్వంలో డిపో పరిసరాలలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.




# ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు - న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 22 : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కొత్తగూడెం డిపోలో కార్మికులతో ఐక్యత వ్యక్తం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ)తో పాటు ఇతర కార్మిక సంఘాలు కొత్తగూడెం డిపో కార్మికులను బుధవారం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. సంజీవ్ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె న్యాయసమ్మతమైందని పేర్కొన్నారు. ఈ సమ్మె కార్మికుల వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సంస్థ సంక్షేమం కోసమేనని తెలిపారు. ఆర్టీసీలో కొత్త బస్సులను సంస్థే కొనుగోలు చేసి నడపడం, ప్రభుత్వం బకాయిలను వెంటనే చెల్లించడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, యూనియన్లతో చర్చలు జరపడం, వేతన సవరణ చట్టం అమలు చేయడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఈ అంశాలు ఉన్నాయని గుర్తుచేస్తూ, వెంటనే యూనియన్లతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కారమైతేనే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సమ్మె విరమించవచ్చని పేర్కొన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న ఆర్టీసీ సమ్మెకు తమ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు మోత్కూరి మల్లికార్జునరావు, జి.సంజీవరావు, లిక్కి నరేష్, జీవన్, సాగర్, కనకాచారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద వసతులు కల్పించాలి

**సిపిఐ నేత పగడాల మల్లేష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 22 : ఖమ్మం నగరంలోని అల్లిపురం డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద మౌలిక వసతుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ నాయకులు పగడాల మల్లేష్ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని అల్లిపురం ప్రాంతంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో బుధవారం 14, 15 డివిజన్ల సిపిఐ నాయకులు సందర్శించారు. గృహవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ, కొత్తగూడెం, అల్లిపురం రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన వారికి, అలాగే నగరంలోని పలు ప్రాంతాల ప్రజలకు ఇక్కడ గృహాలు కేటాయించారని తెలిపారు. అయితే ఇండ్లు కేటాయించినప్పటికీ కనీస మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. విద్యుత్ సరఫరా, త్రాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. తాత్కాలికంగా విద్యుత్ ఇచ్చినప్పటికీ ఇటీవల కరెంట్ నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం మళ్లీ సరఫరా ప్రారంభించినట్లు తెలిపారు. డబుల్ బెడ్రూం కాలనీలో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని డిమాండ్ చేశారు. త్రాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారని, వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగా లేకపోవడం వల్ల ఇబ్బందులు పెరుగుతున్నాయని అన్నారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు లేక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, వెంటనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మౌలిక వసతులను తక్షణమే కల్పించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావూరి సోందయ్య, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, ముద్రబోయిన అప్పారావు, మాకనబోయిన నాగేశ్వరరావు, రాపోలు కొండలు, ప్రతానపు ప్రసాద్, డబుల్ బెడ్రూం వాసులు వీరబాబు, భూమా వెంకటి, వట్టికొండ లక్ష్మి, జంగాల బాబు, టి.నాగేశ్వరరావు, షేక్ సహీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చది విన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు... 1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్ట ళు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తు న్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టు కోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వా లకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవిత మంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొల మానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలం లో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యా ర్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాలను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టు కోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవం తంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహ త్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసి పోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావి స్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యా ర్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలి గిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టు కోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యా నించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనక బడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టు కున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యా మనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వ రంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే.. పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

# పుస్తకాల పరిరక్షణ సామాజిక బాధ్యత

## ఏప్రిల్ 23... ప్రపంచ పుస్తక దినోత్సవం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రపంచ పుస్తక దినోత్సవం (ప్రపం చ కాపీ హక్కుల దినోత్సవం) ప్రతి ఏట ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా నిర్వహి స్తారు. 1995 నుండి నిర్వహించబడు తున్న ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం రోజున పుస్తకం చదవడం, ప్రచురించ డం, కాపీ హక్కులు వంటి విషయా లను ప్రోత్స హించి వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తారు. ప్రపంచ ప్రఖ్యాత రచ యిత మిగ్యుఎల్ డి సెర్వంటెస్ పుట్టి మరణించిన తేది ఏప్రిల్ 23, విలియం షేక్స్పియర్, గార్సియాసాడిలా వేగా వం టి రచయితలు మరణించిన తేదీ, అనేక ఇతర రచయితల పుట్టిన, మరణించిన తేది ఏప్రిల్ 23వ తేది అవడంవల్ల 1995, ఏప్రిల్ 23న యునెస్కో తొలిసారిగా ప్రపంచ పుస్తక దినోత్సవంను నిర్వహిం చింది.


చినిగిన చొక్కా అయినా తొడుక్కో... కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి? వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు.

మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం.

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయుప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది.

గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటి ల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరత ముని 'నాట్యశాస్త్రం హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథా లెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకా నేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావా లనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడా నికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యన్ని తెరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికల సందర్శనలకు హేతువులైనాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రస్తాన త్రయం, భారత భాగవత రామాయణాలు ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపం చంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి...వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయా లను అర్థం చేసుకుని, పుస్తక దినోత్సవం సందర్భంగా పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.




**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, ఏప్రిల్ 22 : ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్‌ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్‌ఫైర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్‌ఫైర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

# సైబర్ నేరాలు పురుగుతున్న వేళ



- బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం
- ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జన్నార్ లేఖ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 22 : సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంత మంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహ కరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలి గ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల

# సీజ్‌ఫైర్ పొడిగిస్తూ ప్రకటన

## జెడి వాన్స్ ఇస్లామాబాద్ పర్యటన రద్దు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, ఏప్రిల్ 22:ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈనేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చలు రద్దు అయ్యాయి. ఇక అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన పాక్ పర్యటన రద్దు చేసుకున్నట్లు వైట్‌హౌజ్ ధ్రువీకరించింది. ఈనెలలో రెండోసారి జేడీవాన్స్ పాక్‌లో పర్యటించాల్సి ఉంది. ఇరానీ ప్రతినిధులతో ఓ డీల్ కుదుర్చుకునేందుకు ఆ ట్రిప్ జరగాల్సి ఉంది. కానీ కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్‌ప్రకటించడంతో వాన్స్‌జర్నీ నిలిపి వేశారు. అయితే ఒకవేళ వ్యక్తిగత సమావేశాలు ఏమైనా ఉంటే దానిపై ప్రకటన చేస్తామని వైట్‌హౌజ్ అధికారులు చెప్పారు. ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను నిరవధికంగా పొడిగించడం పట్ల ట్రంప్‌కు థ్యాంక్స్ చెప్పారు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్. మారిక్వెస్ట్‌ను ఆమోదించి సీజ్‌ఫైర్ ప్రకటించడం సంతోషకరమని, దీని వల్ల దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతుంటా యని అన్నారు. పాకిస్థాన్‌పై విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రదర్శించారని, ఇరాన్‌తో సమస్యను పరిష్కరించేందుకు దౌత్యపరంగా తమ ప్రయత్నాన్ని వీడబోమన్నారు. ఇరు దేశాలు సీజ్‌ఫైర్‌ను కొనసాగిస్తూ సమగ్రమైన శాంతి ఒప్పందాన్ని కుదుర్చు కుంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ కూడా ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇది కీలకమైన అడుగు అని, దీని ద్వార దౌత్యం నిర్వహించేందుకు మార్గం సులువు అవుతుందని, అమెరికా-ఇరాన్ మధ్య విశ్వాసం పెరుగుతుందని సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫానే డుజారిక్ తెలిపారు. సీజ్‌ఫైర్ ను ఉల్లంఘించకుండా, నిర్మాణాత్మకంగా చర్చలు నిర్వహించాలన్నారు. శాంతి చర్చల అంశంలో పాక్ ఇచ్చిన మద్దతును ఆయన ప్రశంసించారు.

# ఆర్జీ-1 ఏరియాలో క్వార్టర్ కౌన్సిలింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖనిటౌన్, ఏప్రిల్ 22 : రామగుండం రీజియన్ లో విధులు నిర్వహిస్తున్న క్యాటగిరి-1 నుండి క్యాటగిరి-6 ఉద్యోగులకు బుధవారం స్థానిక ఆర్సిఓఏ క్లబ్ లో క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. క్వార్టర్ అలాట్ మెంట్ కమిటి ప్రతినిధులుగా అర్జి-1 పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి హాజరై కౌన్సిలింగ్ నిర్వహిం చారు. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్‌లో డి, టి-2, ఎండి, ఎస్టి-2, ఐబి కాలని, శారదానగర్, బస్టాండ్ కాలని, జియం ఆఫీస్ కాలని, పవర్ హౌజ్ కాలని, జవహర్ నగర్, తిలక్ నగర్ లోని మొత్తం 341 క్వార్టర్స్ కు గాను 163 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 45 క్వార్టర్లను అధికారుల సమక్షంలో పారదర్శకంగా ఉద్యోగులకు కేటాయించారు. ఇంకా ఈ కార్య క్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను, సీనియర్ పివో ఫిరోజ్ ఖాన్, సంక్షేమ అధికారులు నిహాల్ సాయి, గణేష్, ఆఫీస్ పివో దేవాచారి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, సెక్యూరిటీ సిబ్బంది తిరుపతి, శ్రీకాంత్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్ - రోజుకు సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టం

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, ఏప్రిల్22 : ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు ఆచయన చెప్పారు. హోర్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే వాళ్లకు నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హోర్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు. జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హోర్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ ఒకవేళ హోర్ముజ్‌ను తాము ఓపెన్ చేస్తే, అప్పుడు ఇరాన్‌తో డీల్ కుదుర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.

# బొగ్గు కార్మికుల భవిష్యత్తుపై మబ్బులు

## - పెన్షన్ నిధికి ఏడాదికి రూ.7240 కోట్ల లోటు
## - సరైన నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర సంక్షోభం-లక్షలాది కుటుంబాలపై ప్రభావం

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 22:దశాబ్దాల పాటు గనుల్లో చెమటోడ్చిన బొగ్గు కార్మికుల వృద్ధాప్య భద్రతపై ఇప్పుడు ఆందోళన మబ్బులు కమ్ముకుంటున్నాయి. జీవితం మొత్తం కష్టపడి పనిచేసిన వేలాది మంది కార్మికులు ఆధారపడుతున్న కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) పెన్షన్ నిధి ప్రతి సంవత్సరం సుమారు రూ.7240 కోట్ల లోటుతో తీవ్ర సంక్షోభంలోకి జారుతోంది. ఈ లోటు కేవలం గణాంకం కాదు, ఇది వేల కుటుంబాల భవిష్యత్తుపై వేలాడుతున్న అనిశ్చితి. పెన్షన్ మీదే ఆధారపడి జీవిస్తున్న వృద్ధ కార్మికులు, వారి కుటుంబాలు భవిష్యత్తు భద్రతపై ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. మార్చి 12న బొగ్గు మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శి రూపేందర్ బరార్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ పరిస్థితిపై గంభీర చర్చ జరిగింది. సీఎంపీఎఫ్ఓ అధికారులు, కోల్ ఇండియా, సింగరేణి, ఈపీఎఫ్ఓ ప్రతినిధులు, ట్రస్టీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఒక విషయం స్పష్టమైంది. ప్రస్తుత పెన్షన్ వ్యవస్థ దీర్ఘకాలంలో నిలబడే స్థితిలో లేదు. కార్మికుల హక్కులు, పెన్షనర్ల జీవన భద్రత కాపాడాలంటే వెంటనే సంస్కరణలు అవసరమని నిపుణులు హెచ్చరించారు. ఈ సమావేశంలో కొత్త విధానాలపై చర్చ జరిగినా కానీ అనిశ్చితి కొనసాగుతోంది. కొత్తగా చేరే ఉద్యోగులను ప్రస్తుత పెన్షన్ పథకం బదులుగా నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్.పి.ఎస్.) వంటి కాంట్రిబ్యూషన్ ఆధారిత విధానంలో చేర్చే ప్రతిపాదన వెలువడింది. అయితే, ఇది తక్షణ సమస్యకు పరిష్కారం కాకపోగా ప్రస్తుత నిధిపై మరింత ఒత్తిడి పెంచే అవకాశముందని సీఎంపీఎఫ్ఓ అభిప్రాయపడింది. అదే సమయంలో, సంస్థ వద్ద ఉన్న అనవసర ఆస్తులను మోనిటైజ్ చేయడం, పరిపాలనా నిధిలోని వాటాను 0.5% నుంచి 0.7% వరకు పెన్షన్ ఫండ్‌కు మళ్లించడం వంటి మార్గాలను పరిశీలిస్తున్నారు.

**ప్రభుత్వం పాత్ర కీలకం:** ప్రస్తుతం ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి నెలకు కేవలం ?726.72 మాత్రమే అందిస్తోంది. ఈ మొత్తం ప్రస్తుత పరిస్థితులకు సరిపోకపోవడంతో, దీనిని ఈపీఎఫ్ఓ స్థాయికి పెంచాలని బలమైన డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి పెరిగిన ఆర్థిక సహాయం, పబ్లిక్ అకౌంట్ ఫండ్ వినియోగానికి అనుమతి, పెన్షన్ లెక్కింపు విధానంలో మార్పులు వంటి అంశాలు చర్చకు వచ్చాయి.

**అసమతుల్యత పెరుగుతోంది:**

బొగ్గు రంగంలో ఉద్యోగుల సంఖ్య తగ్గుతుండగా, పెన్షనర్ల సంఖ్య పెరుగుతోంది. ఆదాయం తగ్గి, వ్యయం పెరుగుతున్న ఈ పరిస్థితి నిధిపై భారీ ఒత్తిడిని సృష్టిస్తోంది. వేతన పరిమితి లేకపోవడంతో ఉన్నతాధికారులకు అధిక పెన్షన్ లభించడం కూడా లోటును మరింత పెంచుతోంది. నిపుణులు ఈపీఎఫ్ఓ తరహాలో వేతన పరిమితి అమలు చేయాలని సూచిస్తున్నారు. సీఎంపీఎఫ్ఓ పబ్లిక్ అకౌంట్‌లో ఉన్న రూ.15,424 కోట్లను లోటు భర్తీకి వినియోగించాలని ప్రతిపాదించగా, దీనికి సూత్రప్రాయంగా అంగీకారం లభించింది. బొగ్గు కార్మికుల పెన్షన్ వ్యవస్థ ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది కార్మికుల గౌరవప్రద జీవితం, వారి కుటుంబాల భద్రతకు సంబంధించిన అంశం. సమయానికి సరైన నిర్ణయాలు తీసుకోకపోతే, ఈ సంక్షోభం మరింత తీవ్రమై లక్షలాది కుటుంబాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. తక్షణ సంస్కరణలు, ప్రభుత్వ భాగస్వామ్యం పెంపు, పారదర్శక విధానాల అమలు ద్వారానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# భూపాలపల్లిలో మళ్లీ నేనే ఎమ్మెల్యే - గండ్ర సత్యనారాయణ రావు

## - రేవంత్ రెడ్డి సభ విజయవంతం చేసిన రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 22: భూపాలపల్లి నియోజకవర్గంలో మళ్లీ తానే ఎమ్మెల్యేగా గెలుస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేసిన రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల సభను విజయవంతం చేసిన భూపాలపల్లి నియోజకవర్గ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయాన్ని చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రభుత్వ కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులను వినియోగించడం సాధారణమని పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నిర్మాణంలో సాంకేతిక లోపాలు ఉన్నట్లు నివేదికలు వచ్చాయని తెలిపారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరుతో లక్ష కోట్ల ప్రజాధనం వృథా చేశారని ఆరోపిస్తూ, ఆ నిధులు ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిషన్ కాకతీయను 'కమిషన్ కాకతీయ'గా మార్చారని బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ప్రతి ఎన్నికలో ఓటమి చెందినా బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి రాలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని స్పష్టం చేశారు. భూపాలపల్లిలో మళ్లీ తానే ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు ఇస్లావాసి దేవన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం...రైతులకు గిట్టుబాటు ధర హామీ.

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 22:భూపాలపల్లి నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భూపాలపల్లి రూరల్ మండలంలోని కమలాపూర్, నాగారం, ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, గొల్లబుద్దారం, గొల్లబుద్దారం తండా గ్రామాలలో పి.ఏ.సి.ఎస్, మాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. సన్న ధాన్యానికి మద్దతు ధర రూ.2,389తో పాటు రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. కోత మిషన్ల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఆర్‌పీఎం 18 నుంచి 20 వరకు బ్లోయర్ ఆన్‌లో ఉంచేలా యజమానులకు వ్యవసాయ శాఖ అధికారులు సూచించాలని చెప్పారు. ఇలా చేయడం ద్వారా ధాన్యంలో తాలు తగ్గుతాయని వివరించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్, సివిల్ సప్లై అధికారి రాములు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యం...ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రేగొండ, ఏప్రిల్ 22: పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రేగొండలో జరిగిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రేగొండ, కొత్తపల్లి గోరి మండలాలకు చెందిన 118 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. మొత్తం రూ.1,18,13,688 విలువగల చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కొంత ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్పకాలంలోనే అనేక ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి పథకం), గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలను రూ.10 లక్షల వరకు పెంపు వంటి పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు. అలాగే పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలులో ఎటువంటి కటింగ్ లేకుండా రైతులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, ఆయా మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

## - సింగరేణి భూపాలపల్లి ఏరియా ఏరియా ఇంజనీర్ మాల ఎర్రన్న
## - వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా పర్యావరణ అవగాహన సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 22: పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సింగరేణి భూపాలపల్లి ఏరియా ఏరియా ఇంజనీర్ మాల ఎర్రన్న పేర్కొన్నారు. వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా బుధవారం భూపాలపల్లి సింగరేణి ఏరియాలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొని పర్యావరణ సంరక్షణపై పిలుపునిచ్చారు. వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ మాల ఎర్రన్న పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి సంపదలను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి జీవన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి హరిత కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. చెట్లను నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి సంరక్షణ వంటి చర్యల్లో ఉద్యోగులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గత 20 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న గ్రీన్ వారియర్, రిటైర్డ్ సింగరేణియన్ జేవీఎస్ చంద్రశేఖర్ సేవలను కొనియాడారు. యూనివర్సిటీలు, అటవీ శాఖలో ఆయన చేస్తున్న ప్రచారం విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం చంద్రశేఖర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఐఇ) జోతి, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ టి.పోషమల్లు, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 22: జిల్లాలో అక్రమ గుడుంబా తయారీపై కట్టడి చర్యల భాగంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వాయిపేట గ్రామంలో పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు. సుమారు 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, తయారీకి వినియోగిస్తున్న సుమారు 350 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి అదే ప్రదేశంలో ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులు కుమ్మరి ప్రవీణ్ (33), బౌతు రామయ్య (49)లపై చట్టపరమైన కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

# ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు - మంత్రి పొంగులేటి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఖమ్మం, ఏప్రిల్ 22: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నగరం 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో వెనుకడుగు వేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన మంచి పథకాలను కొనసాగిస్తూ, కొత్తగా ప్రకటించిన ఆరు హామీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను నేరుగా ప్రజల గడప వద్దకే చేరుస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు. కొత్త రేషన్ కార్డుల విషయంలో గత ప్రభుత్వం విఫలమైందని, తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తున్నదని చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో గత ప్రభుత్వం పేదలకు న్యాయం చేయలేదని విమర్శిస్తూ, తమ ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు గుర్తు చేశారు. ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికిన మంత్రి, ప్రజలు ఇప్పటికే ఎన్నికల్లో వారికి తగిన సమాధానం ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పూనుకొల్లు నీరజ, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయచందర్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి పొంగులేటి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


ఖమ్మం, ఏప్రిల్ 22:ఖమ్మం నగరంలో ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలో పలువురు ఆత్మీయుల మృతి పట్ల తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. పాత అగ్రహారంలో ఆళ్ళ వెంకటరెడ్డి, బోనకల్ రోడ్డులో హెడ్ కానిస్టేబుల్ పోలగాని శ్రీనివాసరావు, శ్రీరామ్ హిల్స్‌లో కార్పొరేటర్ కమర్తపు మురళి తల్లి బతుకమ్మ కుటుంబాలను ఆయన సందర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గాదె వాసుదేవరెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా ఉంటామని మంత్రి తెలిపారు.



## మోడీపై ఖర్గే అనుచిత వ్యాఖ్యలను ఖండించిన ఏసీఎస్ రాజు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 22 : తమిళనాడులో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దేశ ప్రధాని నరేంద్ర మోడీని ఉగ్రవాదిగా పేర్కొనడాన్ని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. సబ్ కా సాత్.. సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ అనే పాలన విధానంతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని ఈ విధంగా పేర్కొనటం సరికాదని అన్నారు. ఇది మోడీని మాత్రమే అవమానించడం కాదని 140 కోట్ల మంది భారతీయులను అవమానించడమేనని, ఉగ్రవాదులకు, దేశద్రోహులకు ఊతమిచ్చే ఈ కాంగ్రెస్, దాని అధ్యక్షుడు ఖర్గే ప్రధాని మోడీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 22,వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి కాశీనాథం, కార్యదర్శి సింగం గంగాధర్, ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, చెట్ల గంగాధర్, నరేందుల శ్రీనివాస్, వేముల దేవరాజం, ఎడమల వెంకట్ రెడ్డి, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఫ్లోర్ లీడర్, పార్టీ విప్‌ల నియామకం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 22 : కోరుట్ల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా రుద్ర సుజాత, పార్టీ విప్‌గా కలాల రాధ సాయిచంద్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా ఇందూరి తిరుమల వాసు, ఫ్లోర్ సెక్రటరీగా గుగ్లావత్ శ్రీకాంత్ లను నియమిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ నియమకానికి సహకరిశీచిన రాష్ట్ర అధ్యక్ష్యులు రాంచందర్ రావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్.అనూప్ రావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యాదగిరి బాబు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కోరుట్ల బీజేపీ పట్టణ అధ్యక్ష్యులు కస్తూరి లక్ష్మి నారాయణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకం అయిన వారిని బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ అనూప్ రావు శాలువాతో సత్కరించారు.




## తుమ్మలచెలక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు

### గురుకుల ప్రవేశాల్లో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికల బహుకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 22 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని తుమ్మలచెలక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం, తల్లిదండ్రుల సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యా యులు పూల్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల ప్రవేశ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారికి జ్ఞాపికలను అంద జేశారు. విద్యార్థులు విద్యలో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో మంచి స్థానాలు దక్కించుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్దూతండా సర్పంచ్ బానోత్ నరేష్, ఉప సర్పంచ్ భూక్య కాంతారావు, టీజీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, మాజీ సర్పంచ్ నాగయ్య, గ్రామ పెద్దలు ఈసం చంటి, మండల కన్వీనర్ ప్రసాద్ శంకర్, కుంటల సిఆర్పి బాదావత్ భాస్కర్ తదితరులు హాజంయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని విద్యార్థులను అభినందించారు.




## ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 22 : ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్(ఎస్ జీ ఎఫ్ ),ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెం లోని సింగరేణి చిల్డ్రన్స్ పార్క్ లో ధరిత్రి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుందని ఈ సందర్భంగా పాల్గొన్న వక్తలు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి జిల్లా అధ్యక్షురాలు డాక్టర్.ఎస్.కె.నూరి మెహరు న్నీసా, జిల్లా కోఆర్డినేటర్ఎం.జ్యోతిరాణి, కోశాధికారి సమ్మయ్య, ముఖ్య ప్రతినిధులు జరీనాబీ, షేక్ ఖాదర్ మొయినుద్దీన్, కళ్యాణి, అంజమ్మ, యశోద, కళావతి, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మే 5న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల నిరాహార దీక్ష

### - 51 శాతం ఫిట్మెంట్‌తో వెంటనే పిఆర్సి అమలు చేయాలి
### - ఎస్టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 22 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాలలో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్ పేర్కొన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో స్టేట్ టీచర్స్ యూనియన్ ద్వితీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మచ్చ శంకర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తమ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 90 రోజుల్లో ఘనమైన పిఆర్సి ప్రకటిస్తామని, పెండింగ్ డి.ఏ లను విడుదల చేస్తామని, హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని వంటి హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఎటువంటి పరిష్కారం చూపకపోవడం పట్ల రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించిందని తెలిపారు. ఈ ఉద్యమంలో ఎస్టియు



కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 51% ఫిట్మెంట్ తో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలనీ, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, పాలేపు శివరామకృష్ణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి మేకల ప్రవీణ్, జిల్లా నాయకులు బండి శ్రీనివాస్, నంద్యానాయక్, గుండెల నరేష్, తిరుపతి చారి, మురళి, వివిధ మండలాల నాయకులు కృష్ణ, జమీరొద్దీన్, నరేందర్, రాజ్ కిరణ్, గంగాధర్, విష్ణు తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి సమస్యల పరిష్కారానికై పోరాటాలే శరణ్యం

### - 3వ రోజు అంగన్వాడీ బాట కార్యక్రమం
### - అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర లక్ష్మీనరసమ్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 22 : మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని అంగన్వాడి సెంటర్లకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మూడవరోజు బుధవారం అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆరు సెంటర్లలో సర్వే నిర్వహించడం జరిగింది మిలిటరీ కాలనీ బీసీ కాలనీ కొండపల్లి గోపాల్ రావు నగర్ కాలనీ కంకర్ బోర్డ్ వన్ కంకరబోర్డు టు విక్రమ్ కాలనీ అంగన్వాడీ సెంటర్లలో సర్వే నిర్వహించి,అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు,హెల్పర్ల సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు నిర్వహిస్తామన్నారు.అంగన్వాడీ టీచర్లకు గౌరవ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలన్నారు.రిటైర్డ్ బెనిఫిట్స్ అందించాలన్నారు.హెల్పర్లకు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. అంగన్వాడీల శ్రమదోపిడి ప్రభుత్వం



చేస్తుందని,అంగన్వాడీలకు స్కూటీలు అందించాలన్నారు. వారి డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని తెలిపారు ఈ సందర్భంగా అద్దె భవనాల్లో ఉన్న వాటికి సొంత భవనాలు ప్రభుత్వం నిర్మించాలని గర్భిణీ స్త్రీల చిన్న పిల్లల కు పౌష్టిక ఆహారాన్ని పెంపొందించాలని ప్రభుత్వం నిధులు పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి,25 వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్, తండా శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

### మున్సిపాలిటీ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 22 : ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి అన్నారు.బుధవారం జిల్లా కేంద్రం ములుగు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లతో కలిసి చలివేంద్రం ను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ,ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్రమైన వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడటం మున్సిపాలిటీ ముఖ్య బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని



చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చలివేంద్రాల ద్వారా అందించే శుద్ధమైన తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపల్ కమిషనర్ రమేష్,మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది,స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటి,జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో గిరిజన గురుకులాల విద్యార్థుల అద్భుతమైన ప్రతిభ



### గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్త పి. రత్నకుమారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 22 : గిరిజన గురుకులాల విద్యార్థులు ఐఐటి,జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచారని గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్త పి. రత్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో దామరవంచ టిజిటిడబ్ల్యూఆర్జెసి (బాయ్స్)కు చెందిన గుగులోతు శేఖర్ 90శాతం మార్కులతో ఎస్టి విభాగంలో 1593 ర్యాంకు సాధించాడు , ఈఎంఆర్ఎస్ సిరోల్ కు చెందిన నందిని 88శాతం మార్కులు సాధించిందని ,ఈఎంఆర్ స్ గూడూర్ కు చెందిన లూనావత్ ఝాన్సీ కి 78శాతం మార్కులు వచ్చాయన్నారు .జేఈఈ మెయిన్స్ లోప్రశంసనీయమైన విజయం రావడంతో ఆర్ సి ఓ అధ్యాపకులను విద్యార్థులను అభినందించారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలి

### రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 22 : ఆర్టీసీ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ డియాండ్ చేసారు. బుధవారం హెచ్‌సీయూ, మియాపూర్ డిపో గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన సంపూర్ణ మద్దతు తెలియచేసారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు.. యూనియన్లను పునరుద్ధరించాలని, 2021, 2025 వేతన సవరణ, 2017 పీఆర్సీ బకాయిలు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సహా అన్ని సమస్యలను ఈ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎన్నో ఏండ్లుగా ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందిస్తున్న కార్మికులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వారి డిమాండ్లను పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజస ఇకనైనా ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,రాము, రాఘవేంద్ర,దరగయ్య, సుభాష్ గౌడ్, శ్రీనివాస్, రాజాబాబు మొదలగు వారు పాల్గొన్నారు.

## పేదలు ఉన్నంతవరకు కమ్యూనిజం నిలుస్తుంది

### ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 22 : మార్క్సిజం అజేయమైన సిద్ధాంతమని, సమాజంలో పేదలు ఉన్నంతకాలం కమ్యూనిజం కొనసాగుతుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని కాచనపల్లి అమరవీరుల స్థూపం వద్ద బుధవారం నిర్వహించిన సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భూక్యా హేరజ్యా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ...ధనిక-పేద తారతమ్యాలు పూర్తిగా తొలగినప్పుడే సమానత్వ సమాజం సాధ్యమవుతుందని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకముందు వరకు కమ్యూనిజం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. పాలకులు కమ్యూనిజాన్ని నిర్మూలించాలంటే ముందుగా పేదరికాన్ని నిర్మూలించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రశ్నించే




స్వరాలను అణిచివేయడానికి "అర్బన్ నక్సలైట్" అనే ముద్ర వేస్తూ తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కాచనపల్లి అమరవీరులకు, విప్లవోద్యమంలో ప్రాణత్యాగం చేసిన యోధులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎట్టి నరసింహారావు, గుగులోత్ రామచందర్, బానోత్ వెంకట్రాం, ధరావత్ పాండ్యా, కొడెం రవి, తోటకూరి సతీష్, బోడ మంచా తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఎంఎల్ 57వ ఆవిర్భవ వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 22 : మావో, ఉపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జయంతి పురస్కరించుకొని, సిపిఐ ఎంఎల్ 57వ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కామ్రేడ్ బట్టు అంజయ్య భవనంపై సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ మండల వెంకన్న జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎర్రజెండా పేదవానికి రక్షణ జెండా అని, పేదవారికి అప్పుడు ఇప్పుడు ఎప్పుడు తోడుగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో గుజ్జు దేవేందర్, అలవాటు లింగ, బట్టు బిన్నమ్మ, బట్టు చైతన్య, కృష్ణ, యాకన్న, గువ్వ శీను,సామ రజిత, తదితరులు పాల్గొన్నారు.

## వేంసూర్ ఏఎస్ఐ నాగేశ్వరరావుకు ఉత్తమ సేవా పథకం పురస్కారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్ 22 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావుకు ఉత్తమ సేవా పథకం పురస్కారం లభించింది. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో సేవలు అందించిన సమయంలో ఆయన చేసిన ఉత్తమ సేవలను గుర్తిస్తూ ఈ అవార్డు ప్రదానం చేశారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా నాగేశ్వరరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ సేవా పథకం పురస్కారం అందుకున్న నాగేశ్వరరావును ఎస్సై కవితతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు.ఈ సందర్భంగా సహచరులు మాట్లాడుతూ, నాగేశ్వరరావు కర్తవ్యనిష్ఠతో పనిచేస్తూ ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని కొనియాడారు.

## టేకులపల్లి మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన

### అభివృద్ధి పనులకు శ్రీకారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, ఏప్రిల్ 22 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆయన పర్యటన మండలంలో సందడి నెలకొల్పింది. మొకంపాడు గ్రామపంచాయతీ నుంచి ఇల్లందు మండలం పూబల్లి గ్రామం వరకు రూ.8.75 కోట్ల వ్యయంతో ఐటిడిఏ నిధులతో నిర్మించనున్న 7 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే మొకంపాడు సమీపం లోని వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కూడా పునాది వేశారు. అనంతరం కోయగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించి లబ్ధిదారు లకు అందజేశారు. అదేవిధంగా రూ.6.90 కోట్ల వ్యయంతో మద్రాస్ తండా నుంచి మెల్లమడుగు గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా నాయకులు కోరం సురేందర్, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి పర్యటనతో మండలంలో అభివృద్ధి పనులకు వేగం పెరుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మమ్మల్నీ బదిలి చేయండి మహాప్రభో!

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : సమగ్ర శిక్షలో ఉద్యోగం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు బదిలీలులేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఆ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాల నుండి అధికారులకు, నాయకులకు తమను బదిలి చేయాలని వందలాది వినతిపత్రాలు ఇచ్చినా బదిలీలు జరుగడంలేదని, ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాన్స్ఫర్ అవకాశాన్ని ఇచ్చారని, తమకు కూడా ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అవసరం ఉన్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో తమ ఉద్యోగులకు బదిలీలు జరిగిన విధముగా ఇప్పుడు కూడా వెంటనే బదిలి చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. భర్త ఒకచోట భార్య ఒకచోట ఉంటూ ఎన్ని సంవత్సరాలు ఉద్యోగాలు చేయాలని, దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తూ ఉద్యోగం చేస్తున్నామని, తమ వృద్ధ తల్లితండ్రులు, పిల్లల బాగోగులు చూసుకోవడానికి సమయం కూడా సరిపోడం లేదని సమగ్రశిక్ష సిబ్బంది వాపోతున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారిని గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వఎదుట హాజరుపరచగా, ఇద్దరికి రూ.4,000 చొప్పున జరిమానా విధించారు. అలాగే ఒక వ్యక్తి రెండోసారి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడినందున న్యాయమూర్తి ఆయనకు 3 రోజుల జైలు శిక్ష విధించారు. అనంతరం అతడిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వరరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, అలా నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనా లకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. రాంగ్ రూట్‌లో వెళ్లకూడదని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిం చాలని, అతివేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు.



## సీఎస్ఆర్ కింద ట్రాక్టర్లు, ట్రాలీలు అందజేసిన ఆర్ఎఫ్సిఎల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 22 : ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఎఫ్సిఎల్ సామాజిక భాధ్యతగా రామగుండం నగర పాలక సంస్థకు రూ.30 లక్షల విలువైన రెండు ట్రాక్టర్లు, రెండు ఆటో ట్రాలీలు ఇచ్చినశీదుకు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కృతజ్ఞతలు తెలిపారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆర్ఎఫ్సిఎల్ సంస్థ యూనిట్ హెడ్ ఎస్.కె జిందాల్ ట్రాలీలతో సహా రెండు ట్రాక్టర్లు, రెండు ఆటో ట్రాలీలను నగర పాలక సంస్థకు బుధవారం అందజేశారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ రామగుండం నగరం పూర్తిగా ఆర్ఎఫ్సిఎల్ ప్రభావిత ప్రాంతమైనశీదున కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద మున్సిపల్ కార్పొరేషన్ కు మరింత సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. తాము లేఖ రాసిన విధంగా మరో వెయ్యి వీధి దీపాలు కూడా ఇవ్వాలని కోరారు. లాభాల ప్రకారం ఐదు నుండి పదకొండు కోట్ల రూపాయలు సిఎస్ఆర్ కింద కేటాయించాల్సి ఉందని అన్నారు. ఆర్ఎఫ్సిఎల్ సంస్థకు పూర్తి స్థాయిలో తాము సహకరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ, ఆర్ఎఫ్సిఎల్ జిఎం ప్రేమ్ కుమార్, సీనియర్ మేనేజర్ వెంకట్ రెడ్డి, కంపెనీ అధికారులతో పాటు కార్పొరేటర్లు కొలని కవిత, వడ్లూరి రవి, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



## మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 22 : మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, యువతకు,విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి.సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ సి. హెచ్. మహేందర్ జి నిర్వహించారు.ఈ సందర్భం గా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన మాదకద్రవ్యాల వినియో గాన్ని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యువత,విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా పోలీస్, ఎక్సైజ్ మరియు విద్యాశాఖలు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.జిల్లాలో గంజాయి సాగు,విక్రయాలు,అక్రమ రవాణాకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ విక్రయాలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, గ్రామ, మండల స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారు లకు సూచించారు. ములుగు సామాజిక ఆసుపత్రిలో ప్రత్యేకంగా డి అడిక్షన్ కేంద్రం అందుబాటులో ఉందని మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రత్యేక వైద్య నిపుణులతో సైకాలజిస్ట్ లతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో డీఎస్పీ కిషోర్ కుమార్,జిల్లా విద్యాశాఖాధికారి సిద్ధార్థ రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత,డీఏఓ డీసీఓ, కలెక్టరేట్ పర్యవేక్షకుడు మహేష్ బాబు,ఎక్సైజ్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, ఏప్రిల్ 22 : భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. మల్లికార్జున్ ఖర్గే డౌన్.. డౌన్.. కాంగ్రెస్ డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు మల్యాల మారుతి మాట్లాడుతూ.. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర స్థాయిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ, ఆయనను రాజకీయ ఉగ్రవాది అని వ్యాఖ్యానిం చారని, ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం ఖర్గే దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని, దీనికి ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేష్, ఉపాధ్యక్షులు జిల్లా సత్యం, బీజేవైఎం మండల అధ్యక్షులు ఆరే శివ, తెడ్డు మహేష్, కాసోజీ ప్రతాప్, కల్లెడ ప్రసాద్, లకావత్ రాజేందర్, నవీన్, రాజం, రాంనాయక్, రాజేందర్, రాజేష్ పాల్గొన్నారు.




## రైతులకు సమతుల్య ఎరువుల వా డకంపై అవగాహన సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 22 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పాలకుర్తి మండలం ఈశాల తక్కళ్లపల్లి గ్రామ పంచాయితీ ఆవరణలో సమస్యల ఎరువుల వాడకంపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తల బృందం డాక్టర్ కే వెంకట్ రమేష్ సీనియర్ సైంటిస్ట్ హెడ్ కెవికె ఎరువులు సమతుల్యం వాడకం ఖర్చు తగ్గించుకోవడంపై రైతులకు వివరించారు. పంట సౌరక్షణ నేల ఆరోగ్యం దాని ప్రాముఖ్యతపై శాస్త్రవేత్త డాక్టర్ వై.వెంకన్న అవగాహన కల్పించారు. నేల శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ పిల్లి భూసార పరీక్ష ఎందుకు చేయాలి ? ఎలా చేయించాలి అనే విషయాలపై రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. పాలకుర్తి మండల ఏవో బండి ప్రమోద్ కుమార్ మోతాదుకు మించి రసాయనిక ఎరువులువాడొద్దని యూరియా వినియోగన్ని తగ్గించేందుకు పచ్చిరొట్ట పంటలను తొక్కివేయడం జీవ ఎరువుల వినియో గంపై అవగాహన కల్పించారు. రైతులు తమ మట్టి నమూనాలు తీసుకొని వస్తే వాటిని ఉచితంగా భూసార పరీక్షలు చేసి కేవీకే పంపిస్తారని ఈ సందర్భంగా అన్నారు. ఈ సదస్సులో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.యోజన సర్పంచ్ బి.శ్రీనివాస్ గౌడ్, అభ్యుదయ సాగు రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే

### - పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆగ్రహం
### -35వ వార్డులో ఆకస్మిక పర్యటన -విద్య, వైద్యంలో రాజీలేదు ఎమ్మెల్యే మురళి నాయక్
### -సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలుకు డిఈఓకు ఆదేశించిన ఎమ్మెల్యే మురళి నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 22 : తెలంగాణ ప్రభుత్వం రేవంత్ పాలనలో విద్య వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని మహబూబాద్ ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్ అన్నారు.బుధవారం మహబూబాద్ మున్సిపాలిటీలోని 35వ వార్డు వెంకటేశ్వర బజారు ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే మురళి నాయక్ అకస్మిక సందర్శించరు .పాఠశాలలో ఉదయం 10:30 అవుతున్న ఉపాధ్యాయులు,విద్యార్థులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే డిఇఓ రాజేశ్వరరావు కి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి పాఠశాలకు సమయపాలన పాటించని ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మురళి నాయక్ ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ విద్యా ,వైద్యం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుంటుందని దీనిలో భాగంగానే డైట్, మెస్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు స్నాక్స్, టిఫిన్ అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా



ఉపాధ్యాయులు వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ ఖలీల్ ,జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రమేష్,మాజీ వార్డు కౌన్సిలర్ చలమాల నారాయణ మాజీ పట్టణ అధ్యక్షులు రాజు గౌడ్,మాజీ వార్డు కౌన్సిలర్ భూక్యా శ్రీను,సురేష్, రాజేష్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సమస్యలను పరిష్కారం చేయాలి

### సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజాద్ పాషా




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 22 : పేదల భూ సమస్యలను పరిష్కరించాలని బుధవారం ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాషా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అంజద్ పాషా మాట్లాడుతూ ములుగు మండలం లోని ప్రజలు రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతున్నారని,జిల్లా అధికారులకు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేయడం జరిగిందని,భూభారతి చట్టం వచ్చిన తర్వాత ములుగు మండలంలో సుమారు 2500 మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తు చేసుకుంటే ఎవరి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.అన్ని గ్రామాల్లో ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించి రైతులందరికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు.ములుగు మండలంలో సాగు నీరు లేక అక్టోబర్ మాసంలో వర్షాలు పడనిచో ప్రతి సంవత్సరం వివిధ రకాల పంటలు ఎండిపోయే దశలో ఉంటాయన్నారు.కావున ప్రభుత్వం రామప్ప నుండి లక్నవరం కాలువ పనులు చేపట్టి సాగునీరు ఇవ్వాలని పొట్లాపురం పంప్ హౌస్ నుండి అన్ని గ్రామాల చెరువులకు కుంటలకు పూర్తిగా సర్వే చేసి సాగునీరు ఇవ్వాలని,లక్నవరం లోతట్టు గ్రామాలైన రాయని గూడెం గ్రామాలకు 15 లిఫ్టులు మరమత్తు చేయాలన్నారు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ముత్యాల రాజు,మంకిడి కృష్ణయ్య బుక్య రాంపూర్ సింగ్,మామిడి నటరాజ్,సారయ్య,బానోత్ నారాయణ సింగ్,డి రామకృష్ణ,వి రమేష్,తిరుపతి,పోతయ్య, సమ్మయ్య,మద్రి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెతో జిలాల్లో సమస్యలు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 22 : ఆర్టీసీ సమ్మె దృశ్య ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తామన్నారు. ప్రైవేట్ వాహనదారులు ఎక్కువ ఛార్జ్ వసూలు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ నంబర్ 9391942254 ఏర్పాటు చేశాం అని,ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మె వల్ల జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సమ్మెతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని మెదక్,నర్సాపూర్ బస్ డిపోల నుంచి బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.మెదక్ నుంచి 100, నర్సాపూర్ నుంచి 34 బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రెండు బస్ డిపోల పరిధిలో కొత్తగా కండక్టర్ లను నియమిస్తున్నామని, అని అదే విధంగా గతంలో ఆర్టీసీ డ్రైవర్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిని పరిశీలించి తీసుకుని వారి సేవలు వినియోగించు కుంటున్నట్లు చెప్పారు.పోలీస్, రెవెన్యూ,రవాణా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేట్ స్కూల్స్,కంపెనీల వారిని సహకరించాలని కోరామని,వారి సహకారంతో ప్రజల అవసరాల మేరకు వారికి బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు.ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అవసరం ఉన్నవారు 9391942254 నంబర్ లో సంప్రదించాలని కోరారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఎవరైనా ప్రైవేట్ వాహనదారులు అధిక ఛార్జీ లు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డిపిఆర్ఓ రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## "క్రీడలు క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయి" - నాగ సీతారాములు.

### సంగం ప్రీమియర్ లీగ్ సీజన్--4 క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 22 : క్రీడలు క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, మానసిక-శారీరక ధృఢత్వాన్ని కల్పిస్తాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో నిర్వహించిన సంగం ప్రీమియర్ లీగ్ సీజన్--4 క్రికెట్ టోర్నమెంట్ గ్రాండ్ ఫైనల్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్‌పీఎల్ ఆర్గనైజర్స్ మెంటర్ బలరాం చింతల లక్ష్మణ్, పిల్లి సర్వేశ్, తిరుమలరెడ్డి శరత్, బోరం యేసు, రెంటాల సుందర్రావు, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మెంటం రాము ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్న నాగ సీతారాములు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గెలుపోటములు క్రీడల్లో సహజమని, ప్రతి ఆటగాడు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి పెట్టాలని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించే ధైర్యం కూడా క్రీడల ద్వారా పెరుగుతుందని అన్నారు. ఆటల నియమ నిబంధనలను పాటిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.

ఈ టోర్నీలో రూ.30,000 మొదటి బహుమతిని లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంత్‌నగర్ పంచాయతీకి చెందిన షఫాన్ జట్టు గెలుచుకోగా, రూ.15,000ల రెండవ బహుమతిని పాల్వంచ మండలం సంగం గ్రామానికి చెందిన సంగం జట్టు, రూ.7,500ల మూడవ బహుమతిని మోహన్ జట్టు గెలుచుకోంది. ఈ కార్యక్రమంలో సంగం గ్రామ సర్పంచ్ బానోతు రవికుమార్, నాగారం సర్పంచ్ ధారావత్ స్వప్న, నారాయణరావుపేట ఉపసర్పంచ్ ఎర్రపోతు సంతోష్, మోదుంపురపు గణేష్, కంటి నరేష్, పాకాల కార్తీక్, అడ్వకేట్ శోభారాణి, స్వాతి స్కూల్ చైర్మన్ నీలిమ, బ్రిందావన్ రెస్టారెంట్, జై పార్క్ యజమాని జిల్, సింగరేణి రిటైర్డ్ జీఎం శనగ వెంకటేశ్వర్లు, జర్నలిస్టు శనగ రామచంద్రరావు, టీఎన్ఆర్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ కార్మికుల సమ్మె-బస్సు సర్వీసులు నిలిచివేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్ 22 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె బుధవారం కొనసాగించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సత్తుపల్లి డిపోకు చెందిన కార్మికులు తెల్లవారుజాము నుంచే విధులను బహిష్కరించి డిపో ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు.తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న 2021 మరియు 2025 పే-స్కేల్‌లను తక్షణమే ప్రకటించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఆర్టీసీలో కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నాలను నిలిపివేసి, ట్రేడ్ యూనియన్లకు అనుమతి ఇచ్చి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.సమ్మె కారణంగా సత్తుపల్లి నుంచి,విజయవాడ,ఖమ్మం వేంసూరు, పెనుబల్లి, కల్లూరు తదితరహౌహౌవెళ్లాల్సిన బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి.దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా ఆసుపత్రులకు వెళ్లాల్సిన రోగులు, పేద మధ్యతరగతి ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమ్మె కొనసాగితే రవాణా సేవలు మరింత ప్రభావితం అయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశం కోసం గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారినీ నీలిమ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 22 : 2026-27 విద్యా సంవత్సరానికి గాను మెదక్ జిల్లాలోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు బెస్టు అవైలబుల్ పాఠశాలలో ప్రవేశానికి ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి.నీలిమ తెలిపారు. జిల్లాలో మొత్తం 20 ఖాళీలు ఉండగా అందులో 3వ తరగతిలో 10 సీట్లు,5వ తరగతిలో 05 సీట్లు,8వ తరగతిలో 05 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు మెదక్ జిల్లాకు చెందినవారయి ఉండాలని, బాలికలకు 33% సీట్లు రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు.ప్రవేశం కొరకు అన్ని గిరిజన తెగలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అదికారి సూచించారు.దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు సేయింట్ జోసెఫ్ హైస్కూల్ సంగారెడ్డి,శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం సిద్దిపేట పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని వివరించారు. దరఖాస్తు ఫారాలను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం,ఇంటిగ్రేటేడ్ కలక్టర్ కాంప్లెక్స్,మెదక్ రెండవ అంతస్తు రూమ్ నెంబర్ ఎస్ 17 నందు 22-04-2026వ తేది నుండి 29-04-2026వ తేది వరకు పొందగలరని, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1,50,000/- లు మరియు పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000/- లలోపు ఉండాలని,దీనితో పాటు మీసేవా నుండి పొందిన కులము,మున్సిపల్ లేదా తహసీల్దార్ లచే దృవీకరించబడిన పుట్టిన తేది దృవీకరణ పత్రము,రేషన్ కార్డు, ఆధార్ కార్డు,గత సంవత్సరం పూర్తి చేసిన తరగతి బోనఫైడ్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు మరియు 2 పాస్పోటు సైజు ఫోటోలు తప్పనిసరిగా జతపర్చవలెనని గిరిజన అభివృద్ధి అదికారి పేర్కొన్నారు.పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో తేది: 07-05-2026 సాయంత్రం 5-00 గంటల లోపు అందజేయాలని,అదే విధంగా తేది:14 -05 -2026 రోజున ఉదయం 11-00 గంటలకు జిల్లా కలెక్టరు కార్యాలయం, మెదక్ నందు లాటరీ పద్ధతిన డ్రా తీసి విద్యార్థుల ఎంపిక నిర్వహించబడునని,ఎంపిక అయిన విద్యార్థుల జాబితా (సెలక్షన్ లిస్టు) తేది: 16-05-2026 రోజున జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం,కలెక్టర్ కాంప్లెక్స్, మెదక్ నందు ప్రకటించబడునని,ఎంపిక అయిన విద్యార్థులకు మొదటి దఫా తేది:20-05-2026 మరియు రెండో దఫా తేది: 30-05-2026 తేదిలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని, ఇట్టి అవకాశాన్ని జిల్లాలోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సూచించారు.





# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

## - కోటి 20 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

## - గొల్లమాడలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 22: ముధోల్ నియోజకవర్గంలోని గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. ఈ రోజు నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్, గొల్లమాడ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తిమ్మాపూర్ గ్రామంలో 90 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల ప్రహరీ గోడ , మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా గొల్లమాడ గ్రామంలో 24 లక్షల రూపాయల నిధులతో చెరువు మరమత్తు పనులు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యా వైద్యం సాగునీరు అందించడమే లక్ష్యంగా తాను ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నానని, 28 ప్యాకేజీ పై పలుమార్లు అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ ప్యాకేజీ పూర్తయితే కుంటాల నర్సాపూర్ మండలాలకు 13 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.. తను శాసన సభ్యునిగా ఎన్నికైనప్పటినుంచి శాసనసభలో సమస్యలపై పలుమార్లు మాట్లాడడం జరిగిందని, అధికార పార్టీలో లేకున్నా అందరి సహకారంతో ప్రతి ఏట నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. గత పది సంవత్సరాల కాలంలో లేని విధంగా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి 25 కోట్ల నిధులు, ముధోల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 220 కోట్ల రూపాయల నిధులు ఒకేసారి మంజూరు కావడం సంతోషకరమన్నారు.

గతంలో లేని విధంగా తన హయంలో అమ్మవారి ఆలయం పునర్నిర్మాణం జరగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. గొల్లమడ చెరువు ప్రధాన కాలువ సిసి లైనింగ్ కు నిధులు మంజూరు చేయిస్తానని, అదేవిధంగా తిమ్మాపూర్ గ్రామానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు ఇస్తానని చెప్పారు. వ్యాపారుల దోపిడీని అరికట్టేందుకు రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకు గతంలో లేని విధంగా మొత్తం ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దశల వారిగా సబ్ సెంటర్లను పెంచనున్నట్లు చెప్పారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఆయా గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# తీవ్ర ఎండల ముప్పు : ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - ఏప్రిల్-మేలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు - మధ్యాహ్నా వేళల్లో బయటకు వెళ్లొద్దని నిపుణుల నిపుణుల హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




మంచిర్యాల, ఏప్రిల్ 22 : దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏప్రిల్ చివరి వారాల నుంచి మే నెల చివరి వరకు పగటి వేళల్లో తీవ్ర ఎండలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు వెళ్లడం తగ్గించడం అత్యంత అవసరం.ఈ కాలంలో వేడి తీవ్రత కారణంగా శరీరంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశముంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల డీహైడ్రేషన్, సన్‌స్ట్రోక్, అలసట వంటి సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి ప్రజలు వీలైనంత వరకు ఇంట్లోనే ఉండి, అవసరం ఉంటే మాత్రమే బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే తల కప్పుకోవడం, నీళ్లు వెంట తీసుకెళ్లడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.వేడి ప్రభావాన్ని తగ్గించేందుకు రోజూ ఎక్కువగా నీరు, మజ్జిగ, పెరుగు, నిమ్మరసం వంటి ద్రవాలను తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. శరీరానికి చల్లదనం అందించే ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.అదేవిధంగా వాహనాల విషయంలో కూడా జాగ్రత్తలు అవసరం. ఎండలో పార్క్ చేసిన కార్లలో గ్యాస్ పదార్థాలు, లైటర్లు, బ్యాటరీలు, సుగంధ ద్రవ్యాలు వంటి వాటిని ఉంచకూడదు. అధిక వేడి కారణంగా అవి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. కారు కిటికీలు కొద్దిగా తెరిచి ఉంచడం ద్వారా గాలి ప్రసరణకు సహాయపడుతుంది. వాహనాల ఇంధనాన్ని సాయంత్రం సమయంలోనే నింపడం ఉత్తమం.ఇళ్లలో కూడా కొంత అప్రమత్తత అవసరం. గ్యాస్ సిలిండర్లను నేరుగా ఎండలో ఉంచకూడదు. విద్యుత్ వినియోగాన్ని నియంత్రించి, అవసరమైన చోట్ల మాత్రమే ఎయిర్ కండిషనర్లు ఉపయోగించాలి. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పాములు, తేళ్లు వంటి జంతువులు లోపలికి రావడం నివారించవచ్చు.వైద్య నిపుణుల ప్రకారం, ఎవరైనా అకస్మాత్తుగా అస్వస్థతకు గురైతే లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగితే వెంటనే సమీప వైద్యులను సంప్రదించడం అత్యవసరం. ప్రతి 2 నుంచి 3 గంటలకు విశ్రాంతి తీసుకోవడం ద్వారా శరీరానికి ఉపశమనం కలుగుతుంది.మొత్తంగా,ఈ వేసవిలో తీవ్ర ఎండల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండటం అవసరం. సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు.

# ఉపాధ్యాయులకు "షీ టీమ్స్" పై అవగాహన సదస్సు



## విద్యార్థుల భద్రతలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

(ప్రజాలక్ష్యం బ్యూరో)


మంచిర్యాల, ఏప్రిల్ 22 : పాఠశాల విద్యార్థుల భద్రత, మహిళల రక్షణ లో షి టీమ్స్ మరియు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నేడు రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో గల కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ నందు జనగణన శిక్షణ లో ఉన్న ఉపాధ్యాయులకు మంచిర్యాల జిల్లా షి టీమ్ ఆధ్వర్యం లో "షీ టీమ్స్ పైన అవగాహన కార్యక్రమం" నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో షి టీమ్ ఎస్.ఐ. హైమ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సమస్యలను తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ఉపాధ్యాయులతో పంచుకునే అవకాశం ఉంటుంది. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనించి, వారికి ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని, వేధింపులకు గురయ్యేవారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు. వేధింపులకు గురయ్యే మహిళలు మరియు బాలికలకు షీ టీమ్స్ ఏ విధంగా అండగా ఉంటాయని సూచించారు. చిన్న పిల్లలకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. సోషల్ మీడియా వినియోగం, ఆన్‌లైన్ వేధింపులు మరియు సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులను ఎలా రక్షించాలో వివరించారు. ఆన్లైన్ మోసాలకు గురి అయినపుడు బాధితులు వెంటనే గోల్డెన్ అవర్ లోపు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలల హక్కులు మరియు పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు కనీస అవగాహన ఉండాలని,విద్యార్థినులు,మహిళల భద్రత కోసం టి సేఫ్ యాప్ ను మొబైల్లో డౌన్లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో దానిని ఉపయోగించే విధానం గురించి వివరించారు. పని ప్రదేశాల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ ఎవరైనా మహిళలను వేధింపులకు గురిచేస్తే వెంటనే డయల్ 100 లేదా 112, రామగుండం షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700 కి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చార్జి ఆఫీసర్ సంపత్ కుమార్ , జనగణన శిక్షకులు హరిప్రసాద్,మధుబాబు గారు, మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇంచార్జి ఎస్.ఐ.హైమ, కానిస్టేబుల్ సతీష్, మహిళా కానిస్టేబుల్ శ్రీలత మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నస్పూర్ పిహెచ్‌సీపై మేయర్ దర్శి మధుకర్ ఆకస్మిక తనిఖీ

## సేవల మెరుగుదలకు ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





మంచిర్యాల, ఏప్రిల్ 22 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ ప్రాంతంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మేయర్ శ్రీ దర్శి మధుకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఆసుపత్రికి చేరుకున్న మేయర్, అక్కడ జరుగుతున్న వైద్య సేవలు, రోగులకు అందుతున్న సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఆసుపత్రిలో వైద్య సిబ్బంది హాజరు, మందుల లభ్యత, శుభ్రత, రోగులకు అందిస్తున్న చికిత్స విధానాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు.మేయర్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు మొదటి వైద్య కేంద్రం కావడంతో, ఇక్కడే ఎక్కువ శాతం రోగులకు అవసరమైన చికిత్స అందేలా చూడాలని సూచించారు. అత్యవసర సేవలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు మరియు సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే రోగులను పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయాలని, లేదంటే సాధ్యమైనంత వరకు పిహెచ్‌సీ లోనే చికిత్స అందించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచడం, రోగులకు అనుకూల వాతావరణం కల్పించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మేయర్‌తో పాటు వైద్యుడు నక్క వెంకటేష్, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# సావర్‌కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయం : జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22: జిల్లాలోని కెరమెరి మండలం సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం కెరమెరి మండలం సావర్ కేడ గ్రామంలోని ప్రధానమంత్రి శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సావర్ కేడ గ్రామ ప్రజలు మద్యపానానికి దూరంగా ఉండడం అభినందనీయమని, ఇది ఐ ఎస్ ఓ సర్టిఫికెట్ పొందడానికి అర్హత ఉన్న గ్రామంగా అభివర్ణించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయడం ద్వారా విద్యార్థులను సామర్థ్యాలు పెంపొందించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు లక్ష్యాన్ని ఎంచుకొని ఏకాగ్రతతో పనిచేస్తే సావరఖేడ స్ఫూర్తితో మరిన్ని పాఠశాలలో తయారవుతాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కొత్తగూడెం కోర్టులో నూతన జిల్లా జడ్జికి ఘన సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 22 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కోర్టులో నూతన ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలతకు ఈసీ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. బుధవారం కోర్టు ప్రాంగణంలోని లైబ్రరీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ ముధలకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ప్రేమలతను పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ బెంచ్--బార్ సమన్వయం న్యాయవ్యవస్థ సమర్థవంతంగా నడవడానికి కీలకమని పేర్కొన్నారు. జిల్లా జడ్జి ప్రేమలత తన ప్రసంగంలో న్యాయవాదులు వృత్తి నైతికతను పాటిస్తూ కోర్టు క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బెంచ్, బార్ మధ్య పరస్పర గౌరవం ఉండాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు షేక్ షాజహాన్ పర్వీన్, కాటూరి సంజీవరావు, ప్రధాన కార్యదర్శి గడిపల్లి మహేష్, జాయింట్ కార్యదర్శి గడదాసు నాగరాజు, క్రీడా కార్యదర్శులు బానోత్ దేవదాస్, నకరాకంటి ఉమ, మల్లెల ఉషారాణి, సీనియర్ న్యాయవాదులు జివికె మనోహర్, గణేష్ బాబు, పలివేల సాంబశివరావు పాల్గొన్నారు.



# న్యాయమూర్తి యువరాజా ను సన్మానించిన ఆశ్రమ పాఠశాల సిబ్బంది

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 22 : కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కోర్ట్ కాంప్లెక్స్‌లో సీనియర్ సివిల్ జడ్జిగా గత మూడు సవంత్సరాలుగా విధులునిర్వహించి బదిలీపై వెళ్తు న్నయువ రాజా ను బుధవారం గిరిజన క్రీడా ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి యువరాజా మాట్లాడుతూ తాను ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన మోటివేషన్ ను గుర్తు చేస్తూ క్రీడా పాఠశాలతో ఉన్న సంబంధం గుర్తు చేస్తూ సంతోషం వ్యక్తం చేసారు. ఇలాగే పాఠశాలను ఇంకా ముందుకు తీసుకెళ్ళలని కోరారు.ఈసందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పవర్ లింబారావ్, సీనియర్ ఉపాధ్యాయులు కూడ్మేత జంగు, టి ఎస్ టి డబ్ల్యూ టి యు జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్,జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, వ్యాయామ ఉపాధ్యాయలు బండ మీనారెడ్డి, గుండం లక్ష్మణ్, వసతి గృహ అధికారి సాయి బాబా,అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, టి ఎస్ టి డబ్ల్యూ టి యు జిల్లా కోశాధికారి కూడ్మేత ఆనంత్,పాఠశాల సిబ్బంది అరుణ, చంపావతి, లక్ష్మి, తదితరులు పాల్గొని జిల్లా సీనియర్ సివిల్ జడ్జిని శాలువా మెమోంటోతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



# వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు శాఖల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలి


## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 22 : మన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు గాను ఇప్పటి నుంచే సంబంధిత శాఖల అధికారులందరూ తగు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రాబోవు రోజుల్లో వనమహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటేందుకు ముందస్తు ప్రణాళికలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీ, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, ఎక్సై జ్, మున్సిపల్, తదితర శాఖల ఆధ్వర్యంలో రాబోవు రోజుల్లో నాటే మొక్కలకు సంబంధించి ప్రణాళికలు ఇప్పటినుంచి సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శాఖ ఆధ్వర్యంలో వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకానికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి ఎం.ఎ. రజాక్, డిఈఓ భోజన్న, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో జిల్లా టాపర్లను సన్మానించిన జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, ఏప్రిల్ 22 : అద్యాపకుల కృషి విద్యార్థులు పట్టుదలతో చదివి ఇంటర్ ఫలితాలలో జిల్లాను మంచి స్థానంలో నిల బెట్టి జిల్లాకు మంచి పేరును తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అద్వర్యంలో ఇంటర్ ఫలితాలలో జిల్లా టాపర్లుగా నిలిచినా విద్యార్థులకు సన్మాన కార్యక్రమానికి జిల్లా మాధ్యమిక విద్యా శాఖ అధికారి రాందాస్తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ 2026 ఫలితాలలో మారుమూల మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాదించి జిల్లాకు గర్వ కారణంగా నిలచారని అన్నారు. అద్యాపకుల కృషి విద్యార్థులు పట్టుదల, సమిష్టి కృషితో రానించారన్నారు. జైనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపిసి విద్యార్థిని 967 మార్కులు సదించగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపిసి విద్యార్థి అఖిల్ సాయి వర ప్రసాద్ 984 మార్కులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపిసి ఉర్దూ మీడియం విద్యార్థిని శాభిన 881 మార్కులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల దాహేగాం సిఇసి విద్యార్థి ఎల్కరి సంతోష్ 936 మార్కులు మొత్తం 15 మంది విద్యార్థులు జిల్లా టాపర్ లుగా నిలిచిన వారికి శాలువల తో సన్మానం చేశారు.ఈ కార్యక్రమములో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లి దండ్రులు, పాల్గొన్నారు.



# గ్రామాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించండి

## రాధా ఎంపీడీవో


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, ఏప్రిల్ 22 : గ్రామాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రాధ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడినారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఎంపిఓ రత్నాకర్ రావు, ఏపీఎంలు రమేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

# సినిమా న్యూస్



## పెళ్లి వార్తలపై వెల్లువెత్తిన ఊహాగానాలు!



ప్రముఖ బుల్లితెర నటి జెన్నిఫర్ వింగెట్ అద్భుతమైన నటనతోనే కాదు. వ్యక్తిగత జీవితంతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా ఆమె మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నారనే వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. ఆమె సోషల్ మీడియా పోస్ట్‌పై వచ్చిన ఓ ఆసక్తికరమైన కామెంట్ తో ఈ చర్చ మొదలైంది. ఈ కామెంట్ చూసిన అభిమానులు, జెన్నిఫర్ త్వరలోనే జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.విషయంలోకి వెళ్తే జెన్నిఫర్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అందమైన ఫోటోలను పంచుకుంది. ఆ ఫోటోలపై ఆమె సన్నిహితులు , స్నేహితులు చేసిన ఓ కామెంట్ అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో పెళ్లికి సంబంధించిన ప్రస్తావన ఉండటంతో అది వైరల్‌గా మారింది. జెన్నిఫర్ కూడా ఆ కామెంట్‌కు స్పందించిన తీరు పుకార్లకు మరింత బలాన్ని చేకూర్చింది. దీంతో ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలపడం మొదలుపెట్టారు. జెన్నిఫర్ వింగెట్ గతంలో నటుడు కరణ్ సింగ్ గ్రోవర్‌ను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల వీరిద్దరూ విడిపోయారు. ఆ తర్వాత జెన్నిపర్ కెరీర్‌పైనే పూర్తి దృష్టి సారించింది. –బేహద్–, –బేపన్నా– వంటి సీరియల్స్‌తో స్టార్ హోదాను దక్కించుకుంది. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు ఎదురైనా? ఎక్కడా వెనకడుగు వేయకుండా నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఆమె మళ్ళీ ఆమెపై వివాహ వార్తలు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. ఈ ప్రచారంపై జెన్నిఫర్ వింగెట్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. సెలబ్రిటీల విషయంలో చిన్న చిన్న కామెంట్స్ , ఫోటోలు పెద్ద ఎత్తున చర్చలకు దారితీయడం సహజమే. కొన్నిసార్లు అవి స్నేహితుల మధ్య జరిగే సరదా సంభాషణలు కూడా అవుతాయి. అయినప్పటికీ జెన్నిఫర్ వంటి పాపులర్ స్టార్ మళ్ళీ పెళ్లి చేసుకోబోతుందనే వార్త ఆమె ఫాలోవర్లలో ఒక రకమైన ఉత్సాహాన్ని నింపింది. ఆమెకు కాబోయే వరుడు ఎవరై ఉంటారనే దానిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికి సంబంధించి ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే ఉంది. జెన్నిపర్ స్వయంగా స్పందిస్తే తప్ప ఇందులో ఎంత నిజం ఉందో తెలియదు. ఏదేమైనా? జెన్నిఫర్ జీవితంలో ఏ నిర్ణయం తీసుకున్నా? ఆమె సంతోషంగా ఉండాలని అభిమానులు కోరుకుంటున్నారు. కెరీర్ పరంగా శిఖరాగ్రాన ఉన్న ఆమె వ్యక్తిగత జీవితంలోనూ అంతే సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీస్తున్నారు.



**అదుపు తప్పిన థై స్లిట్ సొగసు.. వీళ్లకు డ్రెస్సింగ్ సెన్స్ నేర్పించేది ఎవరు?-**

సినిమా ప్రమోషన్స్ అంటే కేవలం ముచ్చట్లు మాత్రమే కాదు.. తారల ఫ్యాషన్ మెరుపులు బోనస్ ట్రీట్ కూడా ఉంటుందనడానికి ఇదో చక్కని ఉదాహరణ. తాజాగా –పతి పత్ని ఔర్ వో 2– చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా సారా అలీ ఖాన్, వామికా గబ్బి, రకుల్ ప్రీత్ సింగ్ ముగ్గురూ కలిసి సందడి చేశారు. అయితే ఈ వేడుకలో సారా అలీ ఖాన్ – వామికా గబ్బి ధరించిన బోల్డ్ థై స్లిట్ డ్రెస్సులు అందరి దృష్టిని ఆకర్షించాయి. వీరిద్దరి గ్లామర్ డోస్ ముందు సీనియర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ కొంత వెలవెలబోయిందనే వ్యాఖ్యలు నెట్టింట వినిపిస్తున్నాయి. ముఖ్యంగా థై స్లిట్ లుక్‌లో సారా, వామికా పోటీ పడటంతో నెటిజన్ల మైండ్ బ్లాక్ అవుతోంది. ఈ ప్రమోషనల్ ఈవెంట్ కోసం సారా అలీ ఖాన్ ఫ్యూచరిస్టిక్ స్నేక్ స్కిన్ డిజైన్‌తో కూడిన సిల్వర్ మెటాలిక్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. హై థై స్లిట్ డ్రెస్ సారాకు అత్యంత స్పెషల్ వైబ్ ని తీసుకొచ్చింది. సాధారణంగా క్లాసీగా కనిపించే సారా ఒక్కసారిగా ఈ రేంజులో రిస్కీ ఫ్యాషన్‌ను ఎంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు వామికా గబ్బి కూడా ఏమాత్రం తగ్గకుండా బ్లాక్ అండ్ వైట్ లెపార్డ్ ప్రింట్ వన్–షోల్డర్ డ్రెస్సులో మెరిసింది. ఆ ఇద్దరు భామల హై స్లిట్ షోని మరింత గ్లామరైజ్ చేసిందనే చెప్పాలి. అయితే ఈ ముగ్గురు భామల ఫ్యాషన్ ఎంపికలపై సోషల్ మీడియాలో.. ముఖ్యంగా –రెడిట్–లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్యాషన్ ప్రయోగాలు బావున్నా..ఈ అవుట్‌ఫిట్స్ మరీ చౌకగా అవుట్ డేటెడ్ స్టైల్‌లో ఉన్నాయని కొందరు నెటిజన్లు పెదవి విరిచేస్తున్నారు. ––వీరికి డ్రెస్సింగ్ సెన్స్ నేర్పించేది ఎవరు?– అంటూ కొందరు ఎద్దేవా చేస్తుంటే.. సినిమా ప్రమోషన్ కంటే డ్రెస్సుల గురించే ఎక్కువగా మాట్లాడుకుంటున్నారని.. ఇది చిత్ర యూనిట్‌కు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రకుల్ ప్రీత్ సింగ్ ధరించిన భారీ లెపార్డ్ ప్రింట్ అవుట్‌ఫిట్ తన బాడీ ఫ్రేమ్‌కు ఏమాత్రం నప్పలేదని విమర్శలు వస్తున్నాయి. గోల్డ్ టోన్ క్రాప్ టాప్ .. భారీ బెలూన్ స్లీవ్స్ ఈ సీనియర్ బ్యూటీ లుక్‌ను దెబ్బతీశాయని ఫ్యాషన్ ప్రియులు భావిస్తున్నారు. ఇక సారా అలీ ఖాన్ తన సహజమైన –రాయల్– లుక్‌ను పక్కన పెట్టి ఇలాంటి మెటాలిక్ షేడ్స్‌లోకి మారడం అభిమానులకు అస్సలు నచ్చలేదు. ఈ డ్రెస్సులన్నీ చూస్తుంటే –కరోల్ బాగ్– మార్కెట్ వైబ్స్ వస్తున్నాయంటూ ఘాటుగా కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి –పతి పత్ని ఔర్ వో 2– ప్రమోషన్స్‌లో ఈ ముగ్గురు భామలు తమ గ్లామర్‌తో హీట్ పెంచాలని చూసినా.. అది కాస్తా ఫ్యాషన్ డిజాస్టర్‌గా మారిందని నెటిజన్లు తీర్పునిస్తున్నారు. నటీమణులు తమ స్టైలిస్టులను ఎంచుకోవడంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. లేకపోతే గ్లామర్ కాస్తా గాడి తప్పే ప్రమాదం ఉందని ఈ ఘటన నిరూపిస్తోంది. అందం ఉన్నా.. సరైన ఫ్యాషన్ ఎంపిక లేకపోతే అది ఎంతటి స్టార్ హీరోయిన్‌కైనా ఇబ్బందికరంగా మారుతుందనడానికి ఈ ఈవెంట్ ఒక ఉదాహరణ అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## రాజా శివాజీతో జెనీలియా కుమారుడి డెబ్యూ!



తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న 'హాసిని' జెనీలియా తన తనయుడిని వెండితెరకు పరిచయం చేస్తోంది. జెనీలియా–రితేష్ దేశ్‌ముఖ్ దంపతుల చిన్న కుమారుడు రాహిల్ దేశ్‌ముఖ్ 'రాజా శివాజీ' సినిమాతో నటుడిగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథతో తెరకెక్కుతున్న ఈ చారిత్రాత్మక చిత్రంలో రాహిల్ 'బాల శివాజీ'గా కనిపిస్తుండటం విశేషం. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో రాహిల్ పలికించిన హావభావాలు, డైలాగులు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ తన కలల ప్రాజెక్ట్‌గా 'రాజా శివాజీ' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాకు ఆయనే స్వయంగా దర్శకత్వం వహించడం విశేషం. తన కుమారుడు రాహిల్‌ను ఒక పవర్‌ఫుల్ చారిత్రాత్మక పాత్ర ద్వారా ఇండస్ట్రీకి పరిచయం చేయాలని రితేష్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా స్టార్ కిడ్స్ లవర్ బాయ్ ఇమేజ్‌తో ఎంట్రీ ఇస్తుంటారు, కానీ రాహిల్ మాత్రం చిన్న వయసులోనే ఒక గొప్ప వీరుడి పాత్రను ఎంచుకుని అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. ముంబైలో అట్టహాసంగా జరిగిన ట్రైలర్ లాంచ్ వేడుకలో రాహిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ట్రైలర్ ఆరంభంలోనే 'స్వరాజ్యం' గురించి రాహిల్ చెప్పే డైలాగులు రోమాంచితంగా ఉన్నాయి. చిన్ననాటి శివాజీ మహారాజ్ పరాక్రమాన్ని, ఆ పదునైన ఆలోచనలను తన నటనతో రాహిల్ ప్రతిబింబించాడు. కేవలం పదేళ్ల వయసులోనే ఇంతటి ఇంటెన్సిటీతో నటించడం చూస్తుంటే, తండ్రికి తగ్గ తనయుడిగా రాహిల్ పేరు తెచ్చుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమాకు మరో విశేషం ఏమిటంటే.. ఇందులో దేశ్‌ముఖ్ ఫ్యామిలీ అంతా భాగమైంది. జెనీలియా స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తూనే, ఒక కీలక పాత్రలో నటించింది. రితేష్ హీరోగా, దర్శకుడిగా బాధ్యతలు చేపట్టగా, వారి చిన్న కుమారుడు రాహిల్ బాల శివాజీగా వెండితెరపై మెరవబోతున్నాడు. ఇక మరాఠా సామ్రాజ్య స్థాపకుడి గాథను ఇంత ప్రామాణికంగా, ఒక కుటుంబం అంతా కలిసి నిర్మించడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి 'రాజా శివాజీ' ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. యాక్షన్ సన్నివేశాలు, ఎమోషన్స్, మరియు రాహిల్ ఎంట్రీ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. మే 1న ఈ చారిత్రాత్మక దృశ్యకావ్యం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఛత్రపతి శివాజీగా రితేష్ గర్జన, బాల శివాజీగా రాహిల్ ముచ్చటైన నటన చూడాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. జెనీలియా తనయుడి సినీ ప్రయాణం ఈ గ్రాండ్ సక్సెస్‌తో మొదలవ్వాలని మనమూ కోరుకుందాం.

## 25 ఏళ్ల తర్వాతే పూర్తి చేసిన రహస్యం!



భారతీయ చలనచిత్ర రంగంలో అప్రతిహతమైన స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్ జీవితంలో ఆధ్యాత్మికతకు ప్రత్యేక స్థానముంది. వెండితెరపై రజనీ విన్యాసాలు కోట్లాది మందిని అలరిస్తే, తెర వెనుక ఆయన గడిపే ప్రశాంత జీవితం ఎందరికో ఆశ్చర్యం కలిగిస్తుంది. తాజాగా రజనీకాంత్ జీవితాన్ని మలుపు తిప్పిన ఓ పుస్తకం గురించి ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. అదే –ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి–. ఈ పుస్తకాన్ని కొన్న పాతికేళ్ల తర్వాత చదవడం విశేషం. రజనీకాంత్‌కు పుస్తకాలు చదవడం అనే అలవాటు ఒక రోజులో వచ్చింది కాదు. రామకృష్ణ ఆశ్రమం ప్రభావంతో ఆయనకు పఠనం పట్ల ఆసక్తి పెరిగింది. కెరీర్ ప్రారంభంలో మానసిక ప్రశాంతత కోసం వెతుకుతున్న సమయంలో ఆశ్రమ వాతావరణం , అక్కడి ఆధ్యాత్మిక గ్రంథాలు రజనీను ఎంతగానో ప్రభావి తం చేశాయి. అప్పటి నుండి రజనీకాంత్ స్క్రిప్ట్‌లకే పరిమితం కాకుండా, లోతైన జీవన సత్యాలను బోధించే పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకున్నారు. అయితే పరమహంస యోగానంద రాసిన –ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి– పుస్తకాన్ని ఆయన 25 ఏళ్ల క్రితమే కొనుగోలు చేశారు. చిత్రమైన విషయం ఏమిటంటే? ఆ పుస్తకం ఆయన దగ్గరే ఉన్నా దానిని పూర్తిగా చదవడానికి మాత్రం పావు శతాబ్దం సమయం పట్టింది. పుస్తకాలు చదవడం అంటే పేజీలు తిప్పడం కాదు. ఆ సమాచారాన్ని స్వీకరించే సరైన సమయం రావాలని రజనీకాంత్ నమ్ముతారు. బహుశా ఆయనలోని ఆధ్యాత్మిక పరిణితి ఆ పుస్తకంలోని సత్యాలను అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవడానికి 25 ఏళ్ల కాలం అవసరమైందేమో. ఈ పుస్తకం చదివిన తర్వాతే రజనీకాంత్ లో ఎన్నో మార్పులొచ్చాయన్నారు. అందులోని బాబాజీ గురించిన విశేషాలు ఆయనను ఎంతగానో ఆకర్షించాయి. రజనీకాంత్ –బాబా– సినిమాకు కూడా ఈ పుస్తకమే ప్రధాన ప్రేరణ అని పలు సందర్భాల్లో వెల్లడించారు. ఒక పుస్తకం ఒక మనిషి ఆలోచనా దృక్పథాన్ని ఎలా మార్చగలదో చెప్పడానికి రజనీకాంత్ ప్రయాణమే మంచి ఉదాహరణ. వేల కోట్ల సామ్రాజ్యం, అంతులేని కీర్తి ఉన్నప్పటికీ, ఆయన వెతుకుతున్న శాంతి ఆ పుస్తకంలోని అక్షరాల్లోనే దొరికిందని ఆయన నమ్ముతారు. రజనీకాంత్ వంటి అగ్ర కథానాయకుడు ఇలాంటి విషయాలను పంచుకోవడం వల్ల సమాజంలో ముఖ్యంగా యువతలో పుస్తక పఠనం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. భౌతిక విజయాలే జీవితం కాదని, అంతర్గత ప్రయాణం కూడా ముఖ్యమని రజనీకాంత్ ప్రవర్తన ద్వారా నిరూపిస్తున్నారు. రామకృష్ణ ఆశ్రమం వేసిన పునాది, –ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి– రజనీకాంత్‌ను ఓ విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దింది. పుస్తకాలు చదవడం అనేది నిరంతర ప్రక్రియ. కొన్ని పుస్తకాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. మరికొన్నిటిని మనం వెతుక్కుంటూ వెళ్తాం.

# ఆరోగ్యం

## బెల్లం,పచ్చి పసుపుతో శరీరంలో కొత్త శక్తి..ఈ విషయం తెలిస్తే అస్సలు ఆగరు





మిగతా సీజన్ లతో పోలిస్తే చలికాలంలో ఎక్కువ వ్యాధులు వచ్చే అవకాశముంటది కాబట్టి ఈ సీజన్ లో ఆరోగ్యం గురించి ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఈ సీజన్ లో వచ్చే అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. శీతాకాలంలో సూపర్ ఫుడ్ గా పరిగణించేవాటిలో పచ్చి పసుపు, బెల్లం కూడా ఉంటాయి. ఉదయాన్నే పచ్చి పసుపు, బెల్లం తింటే మన శరీరానికి బోలెడు ప్రయోజనాలు లభిస్తాయి. ఈ రెండు కలిపి శరీరాన్ని వెచ్చగా ఉంచడంతోపాటు లోపలి నుంచి పోషణను అందిస్తాయి.

ఎలా తినాలి పచ్చి పసుపు, బెల్లం ఆహారంలో చేర్చుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి. పచ్చి పసుపు,బెల్లం రెండింటిని కలిపి టీ తయారు చేసుకోవచ్చు, పెరుగుతో తినవచ్చు. ఈ రెండింటిని నీళ్లలో వేసి మరిగించి కూడా తాగవచ్చు.

తినడం వల్ల వచ్చే ప్రయోజనాలివే రక్తం శుద్ధి రక్తాన్ని శుద్ధి చేయడంలో బెల్లం చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని టాక్సిన్స్ ని తొలగించి రక్తాన్ని శుద్ధి చేస్తుంది. పచ్చి పసుపు రక్తం సన్నబడటానికి కూడా సహాయపడుతుంది..ఇది గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక వ్యవస్థబలోపేతం పచ్చి పసుపులో ఉండే కర్కుమిన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ఇది జలుబు, దగ్గు, ఫ్లూ మొదలైన వ్యాధులతో పోరాడటంలో సహాయపడుతుంది. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి,ఇది శరీరాన్ని వ్యాధుల నుండి కాపాడుతుంది. జీర్ణవ్యవస్థను ఆరోగ్యం పచ్చి పసుపు, బెల్లం రెండూ జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. పచ్చి పసుపు జీర్ణ ఎంజైమ్‌లను సక్రియం చేస్తుంది, ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. బెల్లం జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

## కనుమ స్పెషల్ నాటుకోడి పులుసు..

**కనుమ రోజు చాలా మంది విందు భోజనం చేస్తుంటారు. మాంసాహారంతో ఇంటికి వచ్చిన అతిథులను విందు ఇస్తారు. కనుమ రోజు చేసుకునే వంటల్లో ముఖ్యంగా నాన్ వెజ్ వంటలు ప్రత్యేకం. అందులో ముఖ్యమైనది నాటుకోడి పులుసు. కనుమ రోజున నాటుకోడి పుసును చేసుకొని తింటే ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. అలాగే ఆరోగ్యానికి కూడా ఈ నాటుకోడి పులుసు చాలా మంచిది. ఇంతకీ ఈ నాటుకోడి పులుసు ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? కనుమ స్పెషల్‌గా దీనిని ఎలా చేసుకోవాలి అనేది ఈ స్టోరీలో చెప్పాము. పూర్తిగా చదవండి.**



నాటుకోడి పులుసు కావాల్సిన పదార్థాలు: నాటుకోడి – 1 కిలో మిరియాల పొడి – 1 టేబుల్ స్పూన్ కారం పొడి – 1 టేబుల్ స్పూన్ కొత్తిమీర తాలూకు – 1 టేబుల్ స్పూన్ కరివేపాకు – కొద్దిగా ఉల్లిపాయ – 2 తోటకూర – కొద్దిగా పసుపు – 1/2 టీస్పూన్ అల్లం – చిన్న ముక్క వెల్లుల్లి – 5 రేబలు దోసకాయ – 1 నిమ్మకాయ – 1 కొబ్బరి తురుము – 1/2 కప్ నూనె – 2 టేబుల్ స్పూన్లు ఉప్పు – రుచికి తగినంత నాటుకోడి పులుసు తయారీ విధానం: ముందుగా కిలో నాటుకోడిని శుభ్రంగా కడిగి, చిన్న ముక్కలుగా కోసుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తరువాత పాత్రలో నూనె పోసుకోవాలి. నూనె వేడయ్యాక అందులో అందులో అల్లం, వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. ఆ అల్లం, వెల్లుల్లి రెబ్బలు లేత గోధుమ రంగులోకి వచ్చేంత వరకు వేయించుకోవాలి. అలాగే తరువాత ఉల్లిపాయ ముక్కలు వేసుకొని అవి కూడా లేత బంగారు రంగులోకి వచ్చేంత వరకు బాగా వేయించుకోవాలి. అలాగే అందులోని కరివేపాకులు, కొత్తిమీర వేసుకొని వేయించుకోవాలి. ఆ తరువాత ఆ మిశ్రమంలో కట్ చేసుకొని పెట్టుకున్న నాటుకోడి ముక్కలను వేసుకోవాలి. వాటిని బాగా వేయించుకోవాలి. అందులో పసుపు, మిరియాల పొడి, కారం వేసుకొని అవి మొత్తం ముక్కలకు సరిగ్గా కలిసే విధంగా కలుపుకోవాలి. అలాగే అందులో కొంచెం నీరుపోసుకొని బాగా కలుపుకొని ఉడికించుకోవాలి. కూర మృదువుగా అయ్యాక మూత తీసి అందులో కొబ్బరి తురుము వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత రుచికి తగినంత ఉప్పు వేసుకోని బాగా కలుపుకోవాలి. చివరగా తోటకూర, దోసకాయ ముక్కలు వేసుకొని కొద్దిసేపు ఉడికించుకోవాలి. ఆ తరువాత నిమ్మరసం పిండుకొని.. ఒక్క నిమిషం ఉడికించుకొని సర్వ్ చేసుకుంటే కనుక ప్రత్యేకమైన నాటుకోడి పులుసు సిద్ధమైనట్లే.

## బెంగాలీ స్పెషల్ 'లిక్కర్ ఛాయ్'



బెంగాలీ ప్రజలు పొద్దుపొద్దునే లిక్కర్ ఛాయ్ తాగుతుంటారు. కొంతమంది దీనిని బ్లాక్ టీ అని కూడా పిలుస్తారు. ఈ టీ ఆరోగ్యానికి కూడా చాలామేలు చేస్తుందని చెబుతారు. పొద్దున్నే అరకప్పు ఈ టీ తాగితే మత్తు వదిలిపోతుందని.. రీఫ్రెష్ అయిపోతారని బెంగాలీలు అంటుంటారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఈ ఛాయ్ తాగుతుంటే ఆ మజా మాటల్లో వర్ణించలేని టేస్ట్ ఉంటుందంటారు. మరీ బెంగాలీలు అమితంగా ఇష్టపడే లిక్కర్ ఛాయ్ ని మీరు కూడా మీ ఇంట్లో ఎలా చేసుకోవాలో ఇక్కడ చూడండి.

లిక్కర్ టీ తయారీకి కావాల్సిన పదార్థాలు -1 ఇంచు అల్లం -పావు టీ స్పూన్ మిరియాలు -3 టేబుల్ స్పూన్ల చక్కెర -1 టీస్పూన్ టీ పొడర్ -2 బిర్యానీ ఆకులు

లిక్కర్ టీ తయారీ విధానం -లిక్కర్ టీ కోసం 300 గ్రాముల నీళ్లు బాగా మరిగించి అందులో పంచదార వేసి నీళ్లను తెర్లకాగనివ్వాలి. -పంచదార కరిగి నీళ్లు తెర్లుతున్నప్పుడు అందులో బిర్యానీ ఆకులు, కచ్చాపచ్చాగా దంచిన అల్లం, కచ్చాపచ్చాగా దంచిన మిరియాలు వేసి హై ఫ్లేమ్ మీద పొంగనివ్వాలి. -నీళ్లు రంగు మారిన తర్వాత అందులో టీ పొడర్ వేసి హై ఫ్లేమ్ మీద ఒక నిమిషం మరిగించి స్టవ్ ఆఫ్ చేసేయండి. -ఈ టీనిని వడకట్టుకొని గ్లాస్ లో పోసుకుంటే తాగడానికి టేస్టీ లిక్కర్ టీ రెడీ.

## ముంబై ఫేమస్ వడాపావ్

**వడాపావ్ అంటే చాలా మందికి తెలిసే ఉంటుంది. ముంబైలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఈ స్ట్రీట్ వంటకాన్ని ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు. పెద్ద పెద్ద హీరోలు సైతం ముంబైకి వెళ్ళినప్పుడు దీనిని ఎంత ఇష్టంగా తింటూ ఉంటారు. ఇది చాలా అద్భుతమైన రుచితో ఉంటుంది. అలాగే దీనిని చేసుకోవడం కూడా చాలా సులభం. ముంబై స్టైల్‌లో ఈ వడాపావ్ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.**



వడాపావ్ తయారు చేసుకోవడానికి కావాల్సిన పదార్థాలు బంగాళాదుంపలు శనగపిండి పసుపు ఎండు మిరపకాయలు కొత్తిమీర రుచికి సరిపడా ఉప్పు నూనె పావ్ బన్స్

వడాపావ్ తయారీ విధానం ఈ వడాపావ్ తయారు చేసుకోవడానికి ముందుగా బంగాళాదుంపలను బాగా ఉడికించుకోవాలి. అలాగే వాటిని మెత్తగా చేసుకొని పెట్టుకోవాలి. మెత్తగా చేసుకున్న బంగాళాదుంపలు పసుపు, ఎండు మిరపకాయలు, కొత్తిమీర, రుచికి సరిపడా ఉప్పు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత ఒక బౌల్ తీసుకొని అందులో శనగ పిండిని తీసుకోవాలి. అందులో కొద్దిగా నీరు కలుపుకొని పిండి మాదిరిగా చేసుకోవాలి. ఆ తరువాత బంగాళాదుంప మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఆ ఉండలను వేడి ఫ్రై చేయడానికి నూనె వేడి చేసుకోవాలి. నూనె వేడయ్యాక అందులో బంగాళాదుంప ఉండలను శనగ పిండిలో ముంచుకొని నూనెలో వేయించుకోవాలి. అలా అన్ని ఉండలను వేయించుకున్నాకా.. పావ్ బన్ను తీసుకోవాలి. ఆ బన్నును సగానికి చీల్చుకోవాలి. సగం చీల్చిన తరువాత అందులో బంగాళాదుంప వడను బన్ను మధ్యలో పెట్టుకోవాలి. ఆ తరువాత దానిపై కొత్తిమీర చట్నీ, ఇతర మసాలా సాంబార్‌ను పోసుకోవాలి. అంతే ముంబైలో ఎంతో ఫేమస్ అయిన వడాపావ్ సిద్ధమైనట్లే. దీనిని మీ ఇంట్లోనే ఓసారి ట్రై చేసి రుచి చూడండి. అద్భుతంగా ఉంటుంది అంతే.

## ఓట్స్ పకోడీ ఎప్పుడైనా తిన్నారా?



**ఓట్స్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అయితే మీరు ఎప్పుడైనా ఓట్స్ తో చేసిన పకోడీ తిన్నారా? తినకపోయినట్లయితే ఓసారి టేస్ట్ చేయాల్సిందే. రుచి అద్భుతంగా ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో ఓట్స్ పకోడీ చేసుకొని తింటే వేడి వేడిగా శరీరంలో కొత్త శక్తి వస్తుంది. ఓట్స్ తో పకోడీ చేయడం చాలా చాలా ఈజీ. ఓట్స్ తో పకోడీ తయారు చేయడానికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.**

ఇన్ స్టంట్ ఓట్స్ పకోడి తయారీకి కావాల్సిన పదార్థాలు - 1కప్పు ఓట్స్ -పావు కప్పు బియ్యం పిండి -పావు కప్పు శెనగ పిండి -1 పచ్చిమిర్చి -1 టీస్పూన్ కారం -1/4 టీస్పూన్ పసుపు -1/2 టీస్పూన్ గరం మసాలా పౌడర్ -2 ఉల్లిపాయలు -అల్లం వెల్లుల్లి పేస్ట్ -ఉప్పు -కరివేపాకు -కొత్తిమీర -జీడిపప్పు

ఓట్స్ పకోడి తయారీ విధానం -ఓ బౌల్ లో 1కప్పు ఓట్స్ వేసి అందులో కొంచెం నీళ్లు పోసి తడిపి పక్కనపెట్టుకోండి. -రెండు నిమిషాల తర్వాత అందులో బియ్యపు పిండి, శెనగ పిండి, పచ్చిమిర్చి ముక్కలు, కట్ చేసిన కరివేపాకు, కొత్తిమీర తరుగు, ఉప్పు, కారం, పసుపు, గరం మసాలా పౌడర్, అల్లం వెల్లుల్లి పేస్ట్,ఉల్లిపాయ చీలికలు వేసి బాగా కలుపుకోండి. -కొంచెం కొంచెం నీళ్లు చల్లుకుంటూ పకోడి పిండిలా కొంచెం గట్టిగానే కలుపుకోండి. అందులోనే కొన్ని జీడిపప్పులు కూడా వేసుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి ఆయిల్ వేడి చేడిన తర్వాత అందులో పకోడీలా పిండిని వేసుకోండి. ఉడికిన తర్వాత వాటిని ఓ ప్లేట్ లోకి తీసుకొని సర్వ్ చేసుకోవడమే.

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్







మొదటిపేజీ తరువాయి

అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు. కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కొతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్‌- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్‌- రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాళేశ్వరం పై సీబీఐ విచారణకు సిద్ధమా

## - నిజాయితీ ఉంటే ముందుకు రండి - బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్ట్ లో ఎలాంటి అవినీతి జరగలేదని పదే పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే, వెంటనే స్వయంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అంశంపై హైకోర్టు 'క్లీన్ చీట్' ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తీవ్రంగా విమర్శించారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే, స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకత్వం వెనుకడుగు వేస్తోందని, భారీ ఆర్థిక దోపిడీ, కమిషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి అన్నారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని, విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక ప్రకటనలో ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యతపై ఇప్పటికే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాలు కుంగిపోవడం, పంప్ హౌజ్‌లు దెబ్బతినడం వంటి సంఘటనలు యాదృచ్ఛికం కాదని స్పష్టం చేశారు. ఇవన్నీ ప్రాజెక్టులో జరిగిన పెద్ద ఎత్తున అవినీతికి నిదర్శనాలేనని పేర్కొన్నారు. నాటి టీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యత దెబ్బతిందని, అదే విధంగా నిర్మించిన చెక్ డ్యాములు కూడా కుప్పకూలిన ఘటనలు ప్రజల ముందు ఉన్న వాస్తవాలేనని మంత్రి గుర్తు చేశారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో ఎలాంటి అవినీతి జరగలేదన్నట్టుగా గ్లోబల్ ప్రచారానికి దిగడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, ఇది టీఆర్ఎస్ పాలనలో పెరిగిన మాయాజాల రాజకీయాలే అని విమర్శించారు. నిజాన్ని దాచేందుకు ప్రచార యంత్రాంగాన్ని వినియోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకత్వం, ముఖ్యంగా కేసీఆర్ మరియు కేటీఆర్ ఈ అంశంపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, విచారణ నుంచి ఎందుకు తప్పించుకుంటున్నారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్ట్ పై పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరగడం ప్రజాస్వామ్యంలో కనీస బాధ్యత అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని, ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. నిజం మీవైపు ఉంటే విచారణకు ముందుకు రావాలని లేకపోతే మీ భయం మీ తప్పును నిరూపిస్తుందన్నారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

మొదటిపేజీ తరువాయి

వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ములా వన్ రేస్ పేరు మీద చేసిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'డూప్ ÷టింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వారిని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోందని ఆరోపించారు. అందుకనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కాంగ్రెస్ సర్కార్ వెనుకాడుతోందని విమర్శించారు. ఇది రేవంత్‌రెడ్డి పరిపాలనా వైఫల్యమని, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహమని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? అని నిలదీశారు. దొంగలు, దొంగలు కలిసి తెలంగాణను దోచుకోవడంలో పోటీపడుతూ.. రాష్ట్రాన్నినాశనం చేయాలని అనుకుంటున్నారా..? అని కిషన్‌రెడ్డి సెటైర్లు గుప్పించారు.

# కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

మొదటిపేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయాంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు ఫిల్లర్లు కాదని.. మొత్తం పౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందని.. దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

మొదటిపేజీ తరువాయి

అడుగుతున్నారన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

మొదటిపేజీ తరువాయి

గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేఏసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరులకు నివాళులర్పించి సమ్మెను ముందుకు తీసుకెళ్తామని.. కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే ప్రభుత్వం కమిటీ వేసిందని విమర్శించారు. కమిటీ అవసరం లేదని.. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు జేఏసీ చైర్మన్ తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను సర్కార్ వెంటనే ప్రారంభించాలని వెంకన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని.. వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు సంపూర్ణంగా మద్దతిచ్చాయని... మరో సకల జనుల సమ్మెగా మారుస్తామని అన్నారు. సమ్మెకు మంద కృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మద్దతు ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించాలని.. మరో సకల జనుల సమ్మె కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు.

# కాళేశ్వరం అవినీతి జగమెరిగిన సత్యం

మొదటిపేజీ తరువాయి

తప్పు జరిగిందని తెలుస్తున్న ప్పుడు చర్యలు తీసుకోడానికి ఇబ్బంది ఏంటని కోదండరాం ప్రశ్నించారు. 'బ్యారేజ్ నిర్మాణంలో పిల్లర్లు కుంగిపోయినవి మనకు కనిపిస్తుంది కదా... ఇంకేం కావాలి' అని అన్నారు. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు ఎవరకీ చెంపపెట్టు కాదని కోదండరాం స్పష్టం చేశారు.

# కాళేశ్వరం కథ ముగియలేదు

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# హైకోర్టు తీర్పుతో బుద్ధి తెచ్చుకోవాలి

మొదటిపేజీ తరువాయి

గత్యంతరం లేక మరమ్మతులు చేపడుతున్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మీద చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై ఆయన హర్షణీయం వ్యక్తం చేశారు.

# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చర్చించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చి స్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలగజేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

# ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

మొదటిపేజీ తరువాయి

ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణెళిశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్,హరీష్‌లకు ఊరట

మొదటిపేజీ తరువాయి

ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.






# ఇల్లందు అభివృద్ధికి రూ.50 కోట్లు - మంత్రి పొంగులేటి

## - ప్రజల శ్రేయస్సే లక్ష్యం, సేవాభావంతో పనిచేయాలి - వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 22 : ఇల్లందు మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం ఇల్లందు పట్టణంలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని గృహాలను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌పర్సన్ గదిని ప్రారంభించి చైర్‌పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. తరువాత జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని స్పష్టం చేశారు. ఇల్లందు అభివృద్ధికి ప్రకటించిన రూ.50 కోట్ల నిధులను రెండు విడతల్లో విడుదల చేస్తామని తెలిపారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ మంత్రి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు, కమిషనర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్ట్ పనులపై మంత్రి తుమ్మల పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 22 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతలకుంట గ్రామంలో కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్ట్ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పరిశీలించారు. ప్రాజెక్ట్ పురోగతిని ప్రత్యక్షంగా వీక్షించి, పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ పూర్తి అయితే ప్రాంతీయ రైతులకు నీటి సమస్య తీరుతుందని, వ్యవసాయానికి పెద్ద ఎత్తున లాభం చేకూరుతుందని తెలిపారు. అభివృద్ధి పనులు ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రిహాన బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ కోటేశ్వరి, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు పాల్గొన్నారు. అలాగే ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగం: 'రివర్స్ టూరిజం'

## - 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' కు జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
## - ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి జూపల్లి - హైదరాబాద్ పయనమైన 250 మంది అడవి బిడ్డలు
## - మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్న ఆదివాసీ బృందం - తారామతి బారదరిలో సాదర స్వాగతం పలకనున్న పర్యాటక శాఖ అధికారులు


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, ఏప్రిల్ 22 : రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు.

**ఆదివాసీలతో మమేకమైన మంత్రి**

కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. "బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల





జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**నగర నాగరికతకు - సంస్కృతికి వారధి**

ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,

# పాల్వంచలో లేడీస్ జిమ్, జుంబా స్టూడియో ప్రారంభం

## - ఎమ్మెల్యే కూనంనేని సమక్షంలో ప్రారంభించిన టీపీసీసీ నేత నాగా సీతారాములు.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, ఏప్రిల్ 22 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని 40వ డివిజన్‌లో లేడీస్ జిమ్, జుంబా స్టూడియోను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సదుపాయాలతో జిమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సౌకర్యాలు మహిళల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని తెలిపారు. మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇలాంటి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు, జిమ్ ట్రైనర్ సింధు, కార్పొరేటర్లు బిఎస్ రావు, నూకల సరిత, భవిత కిరణ్, సాయిబాబా, అన్నపూర్ణ, దంతేబోయిన నరేష్, మాజీ పెద్దమ్మ తల్లి గుడి చైర్మన్ మహిపతి రామలింగం, యువజన కాంగ్రెస్ నాయకులు భరత్ తదితరులు పాల్గొన్నారు. పురప్రముఖులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ధరిత్రీ దినోత్సవం

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల, ఏప్రిల్ 22 : ప్రపంచ భూగోళ సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకృతి మిత్ర పర్యావరణ, సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల లో భూగోళ సంరక్షణ, పర్యావరణం పై అవగాహన వేడుకలు నిర్వహించారు.మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని వేంపల్లి లో ఉన్న ఎస్.ఆర్.కె .ఎం నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు

భూగోళ సంరక్షణ... మానవ బాధ్యత...

అంశంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు పాడిన ప్రకృతికి సంబంధించిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అతిథులకు మట్టి పాత్రలను సమర్పించారు. అదే విధంగా పలువురు తయారు చేసిన ప్రకృతి సిద్ధ మైనటువంటి వివిధ వస్తువులను ప్రదర్శించారు. ధరిత్రీ దినోత్సవానికి సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన సందేశత్మక ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో వన మహోత్సవం నిర్వహించి ప్రకృతిమిత్ర వ్యవస్థాపకులు గుండేటి యోగేశ్వర్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా భూగర్భ జల శాఖ అధికారి వేముల సురేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భూగర్భ జలాలను, వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుంతల నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వ వాల్టాచట్టం నిబంధన మేరకు బోర్వెల్స్ ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలను రక్షించుకో వాలన్నారు.నీటి కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటిని పొదుపు చేసి భావి తరాలకు అందించే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ప్రకృతిమిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ "వాల్టా"చట్టం పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లనే భూగోళ సంరక్షణకు




విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు నేలకు,నీటికి ,మట్టికి,చెట్టుకు,గాలికి, హాని కలిగించని ప్రకృతి మిత్ర అలవాట్లను పెంపొందించు కోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్ నివారణకు , క్లోరో ఫ్లోరో వాయువుల నియంత్రించాలని,పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ సిస్టం వాడుకోవాలని, బజార్ కు బట్ట సంచులు తీసుకెళ్లి సింగిల్ యూస్ ప్లాస్టిక్ మానివేయాలని సూచించారు. తెలంగాణా అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ మాట్లాడుతూ పుట్టినరోజుతోపాటు వివిధ సందర్భాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ పోటు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, పండుగల ఆచారాల వల్లనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని. మన దేశం ప్రపంచానికి ఆదర్శం అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ హెచ్.ఈ.ఓజి.నాందేవ్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్ కుమార్ పర్యావరణ ప్రేమికులు మోతే శరత్ చంద్ర, రాజశేఖర్, కుమ్మరి కళాకారులురాజేంద్రప్రసాద్ ,సిబ్బంది యుగంధర్, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# సింగరేణి బకాయిల చెల్లింపుకు 'చలో హైదరాబాద్' పిలుపు

## కేటీకే వన్ ఇంక్లైన్‌లో సీఐటీయూ వాల్ పోస్టర్ల విడుదల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భూపాలపల్లి, ఏప్రిల్ 22 : సింగరేణికి రావాల్సిన బకాయిల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కేటీకే వన్ ఇంక్లైన్‌లో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. బుధవారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి ద్వారా జనరేషన్ కంపెనీలు (జెన్‌కో), ట్రాన్స్‌కో, ఎస్‌టీపీడీ ద్వారా సరఫరా అవుతున్న విద్యుత్‌కు సంబంధించిన ముడి సరుకు బకాయిలుగా సుమారు రూ.51 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, సింగరేణి కార్మికులందరూ ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. వాల్ పోస్టర్ల ద్వారా కార్మికులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కమిటీ సభ్యులు బాపురావు, తోట రమేష్ తదితరులు పాల్గొని కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

# ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు అప్రజాస్వామికం-బేషరతుగా క్షమాపణ చెప్పాలి

## - తమిళనాట ఎన్డీయే కూటమిదే విజయం ఖాయం - డీఎంకే పాలనపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది
## - కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల బిజెపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 22 : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని బీజేపీ జాతీయ నాయకులు, కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఖమ్మంలో విలేకరులతో మాట్లాడుతూ, ఖర్గే వ్యాఖ్యలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా ఉన్నాయని, వెంటనే ప్రధానికి మరియు దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందుతున్న నాయకుడిని అవమానించడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. దేశ సార్వభౌమత్వం కోసం కృషి చేస్తున్న ప్రధానిని అవమానించడం బాధ్యతారాహిత్యమని అన్నారు.

**తమిళనాట మార్పు ఖాయం:**

తమిళనాడు శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించినట్లు పేర్కొన్న ఆయన, ప్రజల్లో మార్పు కోరిక స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎడప్పడి కె. పలని స్వామి నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎం. కె. స్టాలిన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని తెలిపారు. డీఎంకే పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళల భద్రత సవాల్‌గా మారిందని ఆరోపించారు. "ద్రావిడియన్ మోడల్" పేరుతో ప్రచారం చేస్తున్న పాలనలో ప్రజలకు లాభం లేకపోయిందని విమర్శించారు.

**దేశ భద్రతపై మోదీ కఠిన చర్యలు:**

దేశాన్ని ఉగ్రవాద రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తప్పు సంకేతాలు ఇస్తోందని అన్నారు. ప్రతిపక్ష నేతలు ఈ వ్యాఖ్యలపై మౌనం వహించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. కాంగ్రెస్-డీఎంకే కూటమి అపవిత్ర కూటమని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నంతో కేవలం అధికార దాహంతో ఏర్పడినదని, మేనిఫెస్టోలు అమలు కాని హామీలతో నిండి ఉన్నాయని దుయ్యబట్టారు. బీజేపీ మాత్రం "వికసిత భారత్" లక్ష్యంతో పనిచేస్తోందని, పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

**తెలంగాణలో కాంగ్రెస్ వైఫల్యం:**

తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు రుణమాఫీ, మహిళా పథకాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచడంలో బీజేపీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో విజయాన్ని సాధిస్తామని పొంగులేటి సుధాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# గుత్తికోయ గుంపు గ్రామాల్లో మలేరియా సర్వే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, ఏప్రిల్ 22 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని గుత్తికోయ గుంపు గ్రామాల్లో మలేరియా నియంత్రణకు వైద్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. మొట్లగూడెం, సిద్ధారం, నాగారపు జోగుల గ్రామాల్లో బుధవారం సులానగర్ ప్రభుత్వ వైద్య బృందం జ్వరాల సర్వే నిర్వహించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, సులానగర్ వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో ప్రతి ఒక్కరి నుంచి రక్త నమూనాలు సేకరించి, త్వరితగతిన ఫలితాలు ఇచ్చే పరీక్షల ద్వారా మలేరియా గుర్తింపు చేపట్టారు. చత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాలకు తరచూ రాకపోకలు ఉండటంతో ఈ ప్రాంతాల్లో మలేరియా కేసులు నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు. అందువల్ల ముందస్తు చర్యగా ఈ సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మలేరియా లక్షణాలు, నిర్లక్ష్యం చేస్తే కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించిన దోమతెరలను తప్పనిసరిగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సబ్ యూనిట్ అధికారి జాబిశెట్టి శ్రీనివాసరావు, మలేరియా నోడల్ ఆఫీసర్ నాగుబండి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, హెల్త్ వర్కర్లు, సింగరేణి నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com